


# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక


ప్రశ్నించడం మన హక్కు




సంపుటి : 1 సంచిక : 261 పేజీలు :8 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : ఒంగోలు మంగళవారం 26 మే 2026 వెల : 1/-రూ ॥

VOLUME :1 ISSUE :261 PAGES :8 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : ONGOLE TUE 26 MAY 2026 PRICE : 1/- RS

Simultaneously Published form Ongole,Visakhapatnam,Kakinada,Bapatla,Narasarao Peta, YSR Kadapa,Circulated by :Srikakulam,manyam,Vizianagaram,East Godavari,West Godavari,Eluru,Guntur,SPSR Nellore,Tirupati,Chittor,Kurnool,Anantapur






## పోక్సో కేసులో దోషికి రెండు మరణ-శిక్షలు విధిస్తూ కోర్టు తీర్పు

- తమిళనాడులో కీలక తీర్పు వెలువరించిన పోక్సో కోర్టు
- విద్యార్థినిపై అత్యాచారం, అతి దారుణంగా హత్య
- అరుదైన కేసుగా పేర్కొన్న పోక్సో కోర్టు

పెన్ పవర్ డెస్క్:తమిళనాడులో 12వ తరగతి విద్యార్థిని హత్యా చారం కేసులో దోషికి రెండు మరణశిక్షలను విధిస్తూ పోక్సో కోర్టు కీలక తీర్పును వెలువరించింది. విలాతికుళం ప్రాంతానికి చెందిన ఓ విద్యార్థినిపై ధర్మ మునీశ్వరన్ అనే వ్యక్తి అత్యాచారం

- మిగతా 2లో



## పెట్రోల్, డీజిల్ ధరల పెరుగుదలపై స్పందించిన మల్లికార్జున ఖర్గే

- దేశంలో ఇంధన ధరల భారం రోజురోజుకూ పెరుగుతోందన్న ఖర్గే
- రోజువారీ దోపిడీ వల్ల ఎవరు బాగుపడుతున్నారని ప్రశ్న
- సామాన్యుల పొదుపును తగలబెట్టడానికి ప్రభుత్వం పెట్రోల్ జల్లుతోందని విమర్శ

- మిగతా 2లో

## గొడ్డలి పార్టీకి గత ఎన్నికల్లో ప్రజలు సరైన బుద్ధి చెప్పారు



- కమీషన్ల కోసం జగన్ ప్రభుత్వం పారిశ్రామికవేత్తలను వేధించిందన్న అచ్చెన్నాయుడు
- నాకెంత.. నీకెంత అంటూ దోచుకున్నారని విమర్శ
- కూటమి ప్రభుత్వంలో రూ. 23 లక్షల పెట్టుబడులు వచ్చాయని వెల్లడి

పెన్ పవర్ డెస్క్:గత జగన్ ప్రభుత్వం కమీషన్ల కోసం పారిశ్రామికవేత్తలను వేధించి, రాష్ట్ర అభివృద్ధిని పాతాళానికి తొక్కేసిందని మంత్రి అచ్చెన్నాయుడు ఆరోపించారు. శ్రీకాకుళం జిల్లా టెక్కలి నియోజకవర్గం చీపుర్లపాడులో రూ.10.51 కోట్లతో నిర్మించనున్న ఎంఎస్ఎంఈ పార్కుకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... అధికారంలో ఉండగా

- మిగతా 2లో

## గోదావరి పుష్కరాల ఏర్పాట్లపై పవన్ కల్యాణ్ అసంతృప్తి



- గోదావరి పుష్కరాలపై రాజమండ్రిలో పవన్ సమీక్ష
- రూ. 8,600 కోట్ల పనులకు డీపీఆర్‌లు సిద్ధం కాకపోవడంపై అసహనం
- వాస్తవ పరిస్థితులు ఎలా ఉన్నాయో ముఖ్యమంత్రికి వివరించాలని ఆదేశం

పెన్ పవర్ డెస్క్:రాజమండ్రి కార్పొరేషన్ కార్యాలయంలో నిర్వహించిన 2027 గోదావరి పుష్కరాల సన్నద్ధత సమీక్షా సమావేశంలో డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అధికారుల పనితీరుపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. సుమారు 10 కోట్ల మంది భక్తులు వచ్చే ఈ మహత్తర

- మిగతా 2లో



## ఇంధన ధరల పెంపు.. ట్యాక్స్ తగ్గిస్తే రూ.1 లక్ష కోట్ల నష్టం:

- పన్నులు తగ్గిస్తే లక్ష కోట్ల నష్టమన్న నిర్మల
- '3-ఎఫ్' అంశాలపై కేంద్రం ప్రత్యేక నిఘా
- దేశ ఆర్థిక వ్యవస్థ బలంగా ఉందన్న మంత్రి
- భయాందోళనలు సృష్టించొద్దంటూ రాహుల్ గాంధీకి పరోక్ష కౌంటర్

పెన్ పవర్ డెస్క్:దేశంలో ఇంధన ధరలు మరోసారి పెరగడంపై కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ సోమవారం స్పందించారు. పెట్రోల్, డీజిల్‌పై ఎక్సైజ్ సుంకాలను తగ్గిస్తే ప్రభుత్వం దాదాపు రూ.లక్ష కోట్ల ఆదాయం నష్టపోతుందని వెల్లడిం చారు. పశ్చిమాసియా సంక్షోభం కారణంగా అంతర్జాతీయంగా సవాళ్లు ఎదురవుతున్నప్పటికీ దేశ ఆర్థిక వ్యవస్థ పటిష్ఠంగా ఉందన్నారు. కొందరు

- మిగతా 2లో

## చిప్ నుంచి షిప్ వరకు... ఏపీని జెట్ స్పీడ్ తో అభివృద్ధి చేస్తాం



- టెక్నాలజీతో ఏపీని వేగంగా ముందుకు తీసుకెళతామన్న సీఎం చంద్రబాబు
- అమరావతిని క్వాంటం వ్యాలీగా తీర్చిదిద్దుతామని ప్రకటన
- ప్రతి నియోజకవర్గంలో ఒక ఎంఎస్ఎంఈ పార్క్ ఏర్పాటుకు నిర్ణయం
- 23 నెలల్లో రాష్ట్రానికి రూ.23 లక్షల కోట్ల పెట్టుబడులు తెచ్చామని వెల్లడి
- చిప్ నుంచి షిప్ వరకు తయారీపై దృష్టి సారించామని స్పష్టం

- మిగతా 2లో

## కూకట్‌పల్లి బీఆర్ఎస్ సమావేశంలో పాల్గొన్న కేటీఆర్.. పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం

- ఎస్ఐఆర్ పై ప్రత్యేక ప్రజెంటేషన్ ఇచ్చిన కేటీఆర్
- డూప్లికేట్ ఇట్ల పట్ల అప్రమత్తంగా ఉండాలని హెచ్చరిక
- బీఆర్ఎస్ అధికారంలోకి రాగానే నగరంలో 24 గంటల పాటు తాగునీరు ఇస్తామని హామీ

పెన్ పవర్ డెస్క్:కూకట్‌పల్లి నియోజకవర్గంలో నిర్వహించిన బీఆర్ఎస్ జనరల్ బాడీ సమావేశంలో ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పాల్గొన్నారు. పార్టీ నేతలు, కార్యకర్తలకు ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్)పై ప్రత్యేక ప్రజెంటేషన్ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..

- మిగతా 2లో








## చిప్ నుంచి షిప్ వరకు...
## ఏపీని జెట్ స్పీడ్ తో అభివృద్ధి చేస్తాం

టెక్నాలజీని అనుసంధానం చేసుకుని ఆంధ్రప్రదేశ్‌ను జెట్ స్పీడ్‌తో అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళతామని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. మెటా, అమెజాన్, జోహో వంటి ప్రపంచ ప్రఖ్యాత సంస్థలతో రాష్ట్ర ప్రభుత్వం ఒప్పందాలు కుదుర్చుకుందని, యువతకు అపార అవకాశాలు సృష్టిస్తామని ఆయన భరోసా ఇచ్చారు. సోమవారం విజయవాడలో జరిగిన 'ఎంఎస్ఎంఈ గ్రోత్ సమ్మిట్ 2026'లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ, రాష్ట్ర భవిష్యత్తు నాలెడ్జ్ ఎకానమీపై ఆధారపడి ఉందని, దీన్ని అందిపుచ్చుకోవాలని పిలుపునిచ్చారు. అమరావతిని 'క్వాంటం వ్యాలీ'గా మారుస్తామని, క్వాంటం కంప్యూటింగ్ పరికరాల ఉత్పత్తిని కూడా ఇక్కడే చేపట్టేలా చర్యలు తీసుకుంటున్నామని ప్రకటించారు. యువత, విద్యాసంస్థలు ఈ నూతన టెక్నాలజీని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. జెన్ జీ, జెన్ ఆల్ఫా, టీనేజర్ల ఆకాంక్షలకు అనుగుణంగా ప్రభుత్వం విధానాలు రూపొందిస్తుందని తెలిపారు. రాష్ట్రాన్ని మూడు రీజియన్లుగా అభివృద్ధి చేస్తున్నామని, విశాఖపట్నాన్ని ప్రపంచానికే డేటా సెంటర్‌గా తీర్చిదిద్దుతున్నామని చంద్రబాబు వివరించారు. స్టీల్, అల్యూమినియం, రేర్ ఎర్త్ మినరల్స్ వంటి కీలక పరిశ్రమలు రాష్ట్రానికి వస్తున్నాయని తెలిపారు. పుట్టపర్తి నుంచి బెంగళూరు వరకు డిఫెన్స్ కారిడార్‌గా, రాయలసీమను రూ.40 వేల కోట్ల పెట్టుబడితో ఉద్యాన హబ్‌గా అభివృద్ధి చేస్తామన్నారు. కేవలం 36 రోజుల్లోనే ఐదో తరం ఫైటర్ జెట్ యుద్ధ విమానాల టెస్టింగ్ ఫెసిలిటీని రాయలసీమలో ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. సూర్యలంక, గండికోట వంటి పర్యాటక ప్రాంతాలను ప్రపంచస్థాయిలో తీర్చిదిద్దుతామన్నారు.ప్రధానమంత్రి మోదీ ఇచ్చిన 'చిప్ టు షిప్' పిలుపునకు అనుగుణంగా రాష్ట్రంలో మాన్యుఫ్యాక్చరింగ్‌పై దృష్టి సారించామని సీఎం తెలిపారు. కేవలం ఒప్పందాలు చేసుకోవడమే కాకుండా, పరిశ్రమలు వాస్తవ రూపంలో కార్యకలాపాలు ప్రారంభించేలా చూస్తున్నామని, 'సైనింగ్, గ్రౌండింగ్, ఓపెనింగ్' తమ ప్రభుత్వ విధానమని పునరుద్ఘాటించారు. గత 23 నెలల్లో నెలకు రూ.లక్ష కోట్ల చొప్పున మొత్తం రూ.23 లక్షల కోట్ల పెట్టుబడులను రాష్ట్రానికి తీసుకొచ్చామని ఆయన వెల్లడించారు.ఎంఎస్ఎంఈ రంగానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని చంద్రబాబు తెలిపారు. వ్యవసాయం తర్వాత అత్యధిక ఉద్యోగాలు కల్పిస్తున్న ఈ రంగాన్ని ప్రోత్సహించేందుకు ఎంఎస్ఎంఈ పాలసీతో పాటు ప్రైవేట్ పారిశ్రామిక పార్కుల పాలసీలను తీసుకొచ్చామన్నారు. ప్రతి నియోజకవర్గంలో ఒక ఎంఎస్ఎంఈ పార్క్ ఏర్పాటు చేయాలని నిర్ణయించామని, ఇప్పటికే 100 పార్కులకు శంకుస్థాపన చేశామని చెప్పారు. 'వన్ ఫ్యామిలీ, వన్ ఎంటర్‌ప్రెన్యూర్' లక్ష్యంగా పనిచే స్తున్నామని, ఈ ఏడాది 5 లక్షల మంది డ్వాక్రా మహిళలను పారిశ్రా మికవేత్తలుగా మారుస్తామని ప్రకటించారు. రాష్ట్రం నుంచి 100 యునికార్న్ సంస్థలను ఏర్పాటు చేయడమే లక్ష్యమని ఆయన పేర్కొన్నారు.

**డాక్టర్ బీ.ఆర్. అంబేద్కర్ కళావేదికను ప్రారంభించిన సీఎం**

అంతకుముందు, విజయవాడలో 4.4 ఎకరాల విస్తీర్ణంలో 1.45 లక్షల చదరపు అడుగుల స్థలంలో నూతనంగా నిర్మించిన డాక్టర్ బీ.ఆర్. అంబేద్కర్ కళావేదికను ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రారంభించారు. ఈ సందర్భంగా అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పలువురు మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఇతర ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. రాష్ట్రంలో ఇలాంటి మరో ఐదు కన్వెన్షన్ సెంటర్లను నిర్మిస్తామని ఈ వేదికగా సీఎం హామీ ఇచ్చారు.

## ఇంధన ధరల పెంపు.. ట్యాక్స్ తగ్గిస్తే రూ.1 లక్ష కోట్ల నష్టం:

- మొదటి పేజి తరువాయి

పనిగట్టుకొని ప్రజల్లో భయాందోళనలు సృష్టిస్తున్నారని, అలాంటి వాటికి తావులేదని స్పష్టం చేశారు.

**రాహుల్‌కు పరోక్ష కౌంటర్**

స్మాల్ ఇండస్ట్రీస్ డెవలప్‌మెంట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్ఐడీబీఐ) 37వ వార్షికోత్సవంలో మాట్లాడిన మంత్రి ప్రభుత్వంపై వస్తున్న విమర్శలను తిప్పికొట్టారు. పశ్చిమాసియా సంక్షోభం ఉన్నప్పటికీ దేశ ఆర్థిక వ్యవస్థ పటిష్ఠంగా ఉందని స్పష్టం చేశారు. కానీ కొంతమంది అంతా మునిగిపోతోందనేలా భయాలు సృష్టిస్తున్నారని మండిపడ్డారు. పరోక్షంగా రాహుల్ గాంధీని ఉద్దేశించి ఆమె ఈ వ్యాఖ్యలు చేశారు. ఇటీవల ఆయన దేశ ఆర్థిక వ్యవస్థ తీవ్ర సంక్షోభం ఎదుర్కోబోతోందని హెచ్చరించిన విషయం తెలిసిందే.

**'3-ఎఫ్' ఫార్ములా**

పశ్చిమాసియా సంక్షోభం మొదలై మూడు నెలలు కావస్తున్న తరుణంలో ప్రభుత్వం '3-ఎఫ్' (ఫ్యూయల్, ఫెర్టిలైజర్, ఫారెక్స్ - ఇంధనం, ఎరువులు, విదేశీ మారకం)పై ప్రత్యేక దృష్టి సారించిందని నిర్మలా సీతారామన్ తెలిపారు. అంతర్జాతీయ ఒత్తిళ్ల వల్ల ఎరువుల ధరలు ఊహించని స్థాయికి చేరాయని, బంగారం ధరలు పెరగడం కూడా సవాలుగా మారిందని చెప్పారు. బయటి సంక్షోభాలను తట్టుకునేలా మోదీ నేతృత్వంలో వ్యూహాత్మకంగా అడుగులు వేస్తున్నట్లు వివరించారు.

**భయాందోళనలు వద్దు**

ప్రస్తుత సవాళ్లు అన్నీ అంతర్జాతీయ పరిస్థితుల వల్ల వచ్చినవేనని, దేశీయంగా ఆర్థిక పరిస్థితి సానుకూలంగానే ఉందని నిర్మలా సీతారామన్ స్పష్టం చేశారు. సామాన్య ప్రజలు సాధిస్తున్న విజయాలను మరిచిపోయి, కేవలం నెగటివిటీని ప్రచారం చేయడం సరికాదన్నారు. మన దేశం ఇలాంటి భయానక ప్రచారాలను భరించలేదని, మన మాటలు, చేతల ద్వారా ప్రజల్లో నమ్మకాన్ని, ధైర్యాన్ని నింపాల్సిన అవసరం ఉందని హితవు పలికారు.

## పెట్రోల్, డీజిల్ ధరల పెరుగుదలపై స్పందించిన మల్లికార్జున ఖర్గే

అంతర్జాతీయంగా చమురు ధరలు పెరుగుతుండటంతో ప్రభుత్వరంగ చమురు సంస్థలు ఆ భారాన్ని వినియోగదారులకు బదలాయిస్తున్నాయి. ఈరోజు మరోసారి పెట్రోల్, డీజిల్ ధరలు పెరిగాయి. దీంతో లీటర్ పెట్రోల్‌పై రూ.2.84, డీజిల్‌పై రూ.2.86 చొప్పున పెరిగింది. పెట్రోల్, డీజిల్ ధరలు గత రెండు వారాల్లో పలుమార్లు పెరిగాయి. దీంతో ఢిల్లీలో లీటర్ పెట్రోల్ ధర రూ.102.12, లీటర్ డీజిల్ రూ.95.25గా, హైదరాబాద్‌లో పెట్రోల్ రూ.115.58, డీజిల్ ధర రూ.103.74గా ఉంది.పెట్రోల్, డీజిల్ పెరుగుదలపై ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. దేశంలో ఇంధన ధరల భారం రోజురోజుకూ పెరుగుతోందని అన్నారు. రోజువారీ దోపిడీ వల్ల ఎవరు బాగుపడుతున్నారని ప్రశ్నించారు. సామాన్యుల పొదుపును తగలబెట్టడానికి మోదీ ప్రభుత్వం పెట్రోల్ చల్లుతోందని విమర్శించారు. రెండు వారాల్లో పెట్రోల్, డీజిల్ ధరలు నాలుగుసార్లు పెరిగాయని మండిపడ్డారు.2014లో లీటర్ పెట్రోల్ రూ.71.41గా ఉంటే ఇప్పుడు రూ.102.12కు చేరుకుందని గుర్తు చేశారు. రోజువారీ ఇంధన దోపిడీ ఇంకా ముగిసిపోలేదని హెచ్చరించారు. గత పన్నెండేళ్లలో మోదీ ప్రభుత్వం ఇంధనంపై రూ.43 లక్షల కోట్లు దోచుకుందని విమర్శించారు. పెట్రోల్, డీజిల్ ధరలు నాలుగోసారి పెరగడంతో ఈరోజు హెచ్‌పీసీఎల్, బీపీసీఎల్, ఐవోసీ షేర్లు పెరిగినట్లు చెప్పారు. ప్రజల అవసరాల కంటే లాభానికే ప్రాధాన్యం ఇవ్వడం బీజేపీ నైజమని విమర్శించారు. ఇంధన ధరల పేరుతో రైతుల నుంచి ఎంఎస్ఎంఈల వరకు, సమాజంలోని ప్రతి వర్గం బీజేపీ దోపిడీ భారాన్ని మోస్తోందని అన్నారు.

## పోక్సో కేసులో దోషికి రెండు మరణశిక్షలు విధిస్తూ కోర్టు తీర్పు


- మొదటి పేజి తరువాయి

చేసి హత్య చేసినట్లు విచారణలో తేలింది.ఈ కేసును విచారించిన న్యాయస్థానం, విద్యార్థినిపై అత్యాచారానికి పాల్పడటమే కాకుండా అతి దారుణంగా ప్రవర్తించినందుకు గానూ ఈ శిక్షలు విధిస్తున్నట్లు తెలిపింది. దీనిని అరుదైన కేసుగా పేర్కొన్న పోక్సో కోర్టు, గతంలోనూ పలు నేరాల్లో అతడికి ప్రమేయం ఉన్నట్లు విచారణలో వెల్లడైందని తెలిపింది. విలాతికుళం సమీపంలోని వేదనాథం గ్రామానికి చెందిన పన్నెండో తరగతి చదువుతున్న విద్యార్థిని మార్చి 10వ తేదీ సాయంత్రం నుంచి కనిపించకుండా పోయింది. తల్లిదండ్రులు పోలీస్ స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేశారు. మరుసటి రోజు వేదనాథం అటవీ ప్రాంతంలో తీవ్ర గాయాలతో విగతజీవిగా కనిపించింది. తాము ఫిర్యాదు చేసినప్పటికీ పోలీసులు వెంటనే స్పందించలేదని తల్లిదండ్రులు ఆరోపించారు.

ఈ కేసుకు సంబంధించి ఉన్నతాధికారులు స్థానిక ఇన్‌స్పెక్టర్‌ను సస్పెండ్ చేశారు. అనంతరం దర్యాప్తు చేపట్టిన పోలీసులు సీసీటీవీ ఫుటేజీ ఆధారంగా మార్చి 19న నిందితుడిని అరెస్టు చేశారు. అతడు గతంలోనూ ఓ వృద్ధురాలిపై అత్యాచారానికి పాల్పడినట్లు ఆరోపణలు ఉన్నాయి. విద్యార్థినిపై హత్యాచారం జరిగిన సమయంలో అతడు బెయిల్‌పై బయట ఉన్నాడు

# బాదంపప్పు బాగోతాలు -3

- జీవో రాకముందే ఇనాం భూముల ఆన్‌లైన్ ఎలా సాధ్యం..?
- తాడేపల్లిగూడెం--పెంటపాడు భూ సెటిల్మెంట్ల వెనుక "బాదంపప్పు--ఎమ్మార్వో" లింక్ ఏంటీ..?
- జీవోకు ముందే ఇనాం భూముల ఆన్‌లైన్ ఎలా జరిగింది..?
- తాడేపల్లిగూడెంలో లంచాల వసూళ్లతో భారీ భూ దందా జరిగిందా..?
- పెంటపాడు మండలంలో జరిగిన రిజిస్ట్రేషన్ల వెనుక అసలు మాస్టర్‌మైండ్ ఎవరు..?
- "బాదంపప్పు" సెటిల్మెంట్ చెప్పితే... ఎమ్మార్వో ఆన్‌లైన్ చేసేవాడా..?
- భూముల వివాదాల్లో పోలీస్--రెవెన్యూ నెక్సస్‌పై పెరుగుతున్న అనుమానాలు..!
- రాష్ట్ర ప్రభుత్వ జీవో రాకముందే కోట్ల విలువైన ఇనాం భూములు చేతులు మారాయా..?




**ఎడిటర్, పెన్ పవర్ భీమవరం /తాడేపల్లిగూడెం మే 25:** ?రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టిస్తున్న భూ కుంభకోణాల్లో పశ్చిమ గోదావరి జిల్లా తాడేపల్లిగూడెం, పెంటపాడు మండలాలు ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారాయి. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఇనాం భూముల క్రమబద్ధీకరణ లేదా ఆన్‌లైన్ ప్రక్రియకు సంబంధించి ప్రభుత్వం నుంచి ఎలాంటి స్పష్టమైన జీవో వెలువడక ముందే.. ఇక్కడ కోట్ల రూపాయల విలువైన భూములు ఆన్‌లైన్ అయిపోయాయి! ప్రభుత్వ ఆదేశాలు లేవు, ఉన్నతాధికారుల అనుమతులు లేవు.. కానీ రెవెన్యూ రికార్డుల్లో మాత్రం భూముల స్వరూపం మారిపోయింది. అసలు జీవో రాకముందే ఈ ఇనాం భూములను ఆన్‌లైన్ లోకి ఎలా ఎక్కించారు? దీని వెనుక నడిచిన రహస్య శక్తులు ఏవి? అనే కోణంలో 'పెన్ పవర్' లోతుగా పరిశీలించగా విస్తుపోయే నిజాలు వెలుగుచూశాయి.

**తాడేపల్లిగూడెంలో లంచాల వసూళ్లతో భారీ భూ దందా జరిగిందా..?**

?తాడేపల్లిగూడెం మండలంలో గత కొంతకాలంగా సాగిన భూ దందా వెనుక భారీ స్థాయిలో లంచాలు చేతులు మారాయనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. వివాదాస్పదంగా ఉన్న ఇనాం భూములను క్లియర్ చేసేందుకు, వాటిని ప్రైవేటు వ్యక్తుల పేరిట ఆన్‌లైన్ చేసేందుకు ఒక వ్యవస్థీకృత నెట్‌వర్క్ పనిచేసినట్లు తెలుస్తోంది. ఎకరాకు ఇన్ని లక్షలు అంటూ రేట్లు ఫిక్స్ చేసి, మధ్యవర్తుల ద్వారా కోట్ల రూపాయల వసూళ్లకు తెరలేపినట్లు స్థానికంగా గట్టి ప్రచారం సాగుతోంది. ఈ లంచాల పర్వం వెనుక ఒక పక్కా ప్లాన్ ప్రకారం ప్రభుత్వ భూములను, ఇనాం భూములను ప్రైవేటు వ్యక్తుల పరం చేశారనే ఆరోపణలు ఇప్పుడు రెవెన్యూ వర్గాల్లో తీవ్ర కలకలం రేపుతున్నాయి.

**పెంటపాడు మండలంలో జరిగిన రిజిస్ట్రేషన్ల వెనుక అసలు మాస్టర్‌మైండ్ ఎవరు..?**

ఈ అక్రమ భూ దందా కేవలం తాడేపల్లిగూడెం మండలంతోనే ఆగిపోలేదు. దీని సెగ పక్కనే ఉన్న పెంటపాడు మండలానికి కూడా పాకింది. పెంటపాడు మండల పరిధిలో కూడా భారీ ఎత్తున ఇనాం భూముల రిజిస్ట్రేషన్లు జరిగినట్లు విశ్వసనీయ సమాచారం. నిబంధనలకు విరుద్ధంగా, ఎలాంటి లీగల్ క్లియరెన్స్ లేని భూములకు కూడా చకచకా రిజిస్ట్రేషన్లు ఎలా జరిగిపోయాయి? రిజిస్ట్రేషన్ల శాఖను, రెవెన్యూ శాఖను వెనకుండి నడిపించిన ఆ 'మాస్టర్‌మైండ్' ఎవరు?

తెర వెనుక ఉండి చక్రం తిప్పిన ఆ అదృశ్య హస్తం ఎవరిది? అన్న ప్రశ్నలు ఇప్పుడు జిల్లా వ్యాప్తంగా సంచలనంగా మారాయి.

**"బాదంపప్పు" సెటిల్మెంట్ చెప్పితే... ఎమ్మార్వో ఆన్‌లైన్ చేసేవాడా..?**

ఈ మొత్తం వ్యవహారంలో అప్పటి తాడేపల్లిగూడెం/ ప్రస్తుత పెంటపాడు ఎమ్మార్వో, సునీల్ పాత్రపై తీవ్ర స్థాయిలో అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఆయన హయాంలోనే ఈ భూముల ఆన్‌లైన్ ప్రక్రియ వేగవంతంగా జరిగిందని ఆరోపణలు వస్తున్నాయి. అయితే, ఇక్కడే ట్విస్ట్ ఏంటంటే.. ఈ కథలో "బాదంపప్పు"గా పేరుగాంచిన ఒక కీలక పోలీస్ అధికారి పేరు ప్రముఖంగా వినిపిస్తోంది!

**ఇన్సైడ్ టాక్:**

స్థానిక వర్గాల నుంచి అందుతున్న సమాచారం ప్రకారం.. భూ వివాదాలు, ఇనాం భూముల సెటిల్మెంట్ల విషయంలో ఈ "బాదంపప్పు" అనే అధికారి రంగంలోకి దిగేవారని సమాచారం.

ఆయన స్టేషన్ పరిధి దాటి, సివిల్ వివాదాల్లో తలదూర్చి సెటిల్మెంట్లు చేసేవారని టాక్. "బాదంపప్పు" గ్రీన్ సిగ్నల్ ఇచ్చి, సెటిల్మెంట్ ఓకే అని చెబితే చాలు.. అప్పటి ఎమ్మార్వో సునీల్ వెనకా ముందు చూసుకోకుండా రికార్డులను ఆన్‌లైన్ చేసేవారనే ప్రచారం ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారింది.

**భూముల వివాదాల్లో పోలీస్--రెవెన్యూ నెక్సస్‌పై పెరుగుతున్న అనుమానాలు..!**

సాధారణంగా భూ వివాదాలు సివిల్ కోర్టుల పరిధిలోకి వస్తాయి. శాంతిభద్రతల సమస్య వస్తే తప్ప పోలీసులు ఇందులో జోక్యం చేసుకోకూడదు. కానీ, తాడేపల్లిగూడెం, పెంటపాడు పరిధిలో మాత్రం సీన్ రివర్స్ అయింది. పోలీస్ అధికారి "బాదంపప్పు", రెవెన్యూ అధికారి ఎమ్మార్వో సునీల్ ఇద్దరూ చేతులు కలిపి ఒక అపవిత్ర కూటమిగా (నెక్సస్) ఏర్పడ్డారనే అనుమానాలు బలపడుతున్నాయి. ఎవరైనా భూమి వివాదాలతో పోలీస్ స్టేషన్ మెట్లెక్కితే.. అక్కడ "బాదంపప్పు" తన స్టైల్ లో ఒత్తిడి తెచ్చి, ఆపై రెవెన్యూ వ్యవస్థను లూప్ లోకి తీసుకుని రికార్డులు మార్పించేవారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఒకరికొకరు సహకరించుకుంటూ ప్రభుత్వ ఆస్తులను, ఇనాం భూములను ప్రైవేట్ వ్యక్తులకు కట్టబెట్టేలా ఈ పోలీస్-రెవెన్యూ నెక్సస్ పనిచేసిందనే వాదనలకు బలం చేకూరుతోంది.

**ప్రభుత్వ జీవో రాకముందే కోట్ల విలువైన ఇనాం భూములు చేతులు మారాయా..?**

చట్ట ప్రకారం ఇనాం భూములపై ఎలాంటి నిర్ణయం తీసుకోవాలన్నా ప్రభుత్వం నుంచి స్పష్టమైన ఉత్తర్వులు ( జీ ఓ) రావాలి. కానీ ఇక్కడ ప్రభుత్వ జీవో కంటే ముందే రికార్డులు మారిపోయాయి, రిజిస్ట్రేషన్లు జరిగిపోయాయి, కోట్ల విలువైన భూములు యజమానులను మార్చేసుకున్నాయి!

ఈ మహా భూ భాగోతంపై ఇప్పుడు ప్రజలు, బాధితులు ముక్తకంఠంతో కొన్ని ప్రశ్నలను సంధిస్తున్నారు.

ప్రభుత్వం నుంచి ఎలాంటి జీవో రాకుండానే కోట్ల విలువైన ఇనాం భూములు ఆన్‌లైన్ లోకి ఎలా వచ్చాయి? సాంకేతిక వ్యవస్థను ఎలా మేనేజ్ చేశారు?

ఒక సివిల్ వివాదంలో, ఇనాం భూముల క్లియరెన్స్ లో పోలీస్ అధికారి "బాదంపప్పు" జోక్యం ఏంటి? ఆయనకు, రెవెన్యూ అధికారులకు ఉన్న సంబంధం ఏంటి?

ఈ అక్రమ ఆన్‌లైన్, రిజిస్ట్రేషన్ల వెనుక లంచాల రూపంలో ఎన్ని కోట్లు చేతులు మారాయి? ఈ సొమ్ము ఎవరెవరి జేబుల్లోకి వెళ్ళింది?

**చివరిగా :**

తాడేపల్లిగూడెం, పెంటపాడు మండలాల్లో జరిగిన ఈ ఇనాం భూముల అక్రమ ఆన్‌లైన్ వ్యవహారంపై కేవలం శాఖాపరమైన విచారణ సరిపోదని. దీని వెనుక పెద్ద తిమింగలాలు ఉన్నాయని, కాబట్టి, రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే స్పందించి విజిలెన్స్ మరియు ఏసీబీ అధికారులతో సమగ్ర ఉన్నత స్థాయి దర్యాప్తు జరిపించాలని, అక్రమాలకు పాల్పడిన ఎమ్మార్వో సునీల్, సదరు బాదంపప్పు (పోలీస్ అధికారి) పై కఠిన చర్యలు తీసుకుని, ప్రభుత్వ భూములను కాపాడాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు!

**ఎపిసోడ్ 13**

బాదంపప్పు ఆస్తులు చిట్టా వింటే నోర్లు వెళ్ళబెట్టాల్సిందేనా..?
బంధువుల పేరు మీద ఎక్కడెక్కడ ఎంత ఆస్తులు కూడ బెట్టాడు..?
లాకర్ లలో ఉన్న ఆ బంగారులక్ష్మీ విలువ ఎంత ..?
సర్వీసులోకి వచ్చేటప్పటికీ బాదంపప్పు ఆస్తి ఎంత..?
ఇప్పుడు బాదంపప్పు ఆస్తి ఎంత..?
చదువుతూనే ఉండండి క్రైమ్ అండ్ సస్పెన్స్ థ్రిల్లర్ సినిమాలు తలపించే బాదంపప్పు కథలు

## 'ఇంకా పాఠాలు నేర్చుకోలేదు'.. నీట్ పేపర్ లీక్‌లపై సుప్రీంకోర్టు తీవ్ర ఆగ్రహం!

- మొదటి పేజి తరువాయి

పరీక్షల నిర్వహణలో పారదర్శకత లోపించిందని ఫైమా, యూడీఎఫ్ సంస్థలు సుప్రీంకోర్టును ఆశ్రయించాయి. లోపభూయిష్టంగా మారిన ఎన్‌టీఏ స్థానంలో సరికొత్త వ్యవస్థను తీసుకురావాలని లేదా దాన్ని పూర్తిగా ప్రక్షాళన చేయాలని కోర్టును కోరారు. నీట్ యూజీ పరీక్షలను కట్టుదిట్టంగా, స్వతంత్రంగా నిర్వహించేలా ఒక పటిష్ఠమైన యంత్రాంగాన్ని ఏర్పాటు చేయాలని పిటిషన్‌లో డిమాండ్ చేశారు.

**మూడు రోజుల్లో అఫిడవిట్**

గత నీట్ పేపర్ లీక్ వివాదం తర్వాత పరీక్షల పర్యవేక్షణ కోసం కోర్టు ఉన్నత స్థాయి కమిటీని ఏర్పాటు చేసింది. గతేడాది నవంబర్ 14న ఏర్పాటైన ఈ మానిటరింగ్ కమిటీ చేసిన సిఫార్సులను ఎంతవరకు అమలు చేశారో స్పష్టం చేస్తూ అఫిడవిట్ దాఖలు చేయాలని సుప్రీంకోర్టు ఎన్‌టీఏను ఆదేశించింది. ఈ కమిటీకి నేతృత్వం వహించిన జస్టిస్ రాధాకృష్ణన్ కూడా సిఫార్సుల అమలుపై తీసుకున్న చర్యలను కోర్టుకు వివరించాల్సి ఉంటుంది. ఈ అఫిడవిట్లను మూడు రోజుల్లోగా సమర్పించాలని గడువు విధించింది.

## గోదావరి పుష్కరాల ఏర్పాట్లపై పవన్ కల్యాణ్ అసంతృప్తి

- మొదటి పేజి తరువాయి

ఆధ్యాత్మిక వేడుకకు ఇప్పటివరకు సరైన సన్నద్ధత కనిపించడం లేదని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. రూ.8,600 కోట్ల వ్యయంతో చేపట్టాల్సిన పనులకు ఇప్పటికీ డీపీఆర్‌లు సిద్ధం కాకపోవడంపై అసహనం వ్యక్తం చేశారు. కాగితాలపై ప్రణాళికలు కాకుండా క్షేత్ర స్థాయిలో పనులు కనిపించాలని చెప్పారు. క్షేత్ర స్థాయిలో వాస్తవ పరిస్థితులు ఎలా ఉన్నాయో సీఎం చంద్రబాబుకు వివరించాలని అధికారులను ఆదేశించారు.సరైన ప్రణాళిక లేకుండా ఒకే ఏడాదిలో 7 వేల పనులు హడావుడిగా చేస్తే నాణ్యత దెబ్బతింటుందని పవన్ హెచ్చరించారు. "పాడైపోయిన సిమెంట్‌తో పనులు చేసి ప్రమాదాలు జరిగితే ప్రభుత్వానికి చెడ్డపేరు వస్తుంది, స్పష్టమైన డేటా లేకుండా అడిగితే కేంద్ర ప్రభుత్వం నిధులు ఇవ్వదు" అని స్పష్టం చేశారు. గత పుష్కరాల తొక్కిసలాట ఘటనలు పునరావృతం కాకుండా, ఆరు జిల్లాల్లోని 274 పంచాయతీల వరకు ఏర్పాట్లు విస్తరించాలని, గోదావరి కాలుష్య నివారణకు టాస్క్ ఫోర్స్ ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ అంశాన్ని త్వరలోనే కేబినెట్‌లో చర్చిస్తామన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ సోము వీర్రాజు మాట్లాడుతూ, పుష్కరాల నిధుల సమీకరణలో పవన్ కల్యాణ్ ఆశాకిరణంలా నిలుస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు.

## గొడ్డలి పార్టీకి గత ఎన్నికల్లో ప్రజలు సరైన బుద్ధి చెప్పారు

- మొదటి పేజి తరువాయి

'నాకెంత.. నీకెంత' అంటూ దోచుకున్న ఆ 'గొడ్డలి పార్టీ'కి గత ఎన్నికల్లో ప్రజలే సరైన బుద్ధి చెప్పారని, రాబోయే రోజుల్లో ఆ పార్టీ శాశ్వతంగా తుడిచిపెట్టుకుపోవడం ఖాయమని జోస్యం చెప్పారు.గత ప్రభుత్వం విశాఖ స్టీల్ ప్లాంట్ భూములను ఆక్రమించుకోవాలని చూస్తే, కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే సీఎం చంద్రబాబు కేంద్రంతో మాట్లాడి రూ.15 వేల కోట్లు మంజూరు చేయించి ఉక్కు పరిశ్రమను కాపాడారని అచ్చెన్నాయుడు పేర్కొన్నారు. చంద్రబాబు, పవన్ కల్యాణ్ నాయకత్వంలో 'స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్' విధానంతో కేవలం 23 నెలల్లోనే రూ.23 లక్షల కోట్ల పెట్టుబడులను రాష్ట్రానికి ఆకర్షించామని, యువతకు 20 లక్షల ఉద్యోగాల కల్పనే తమ ప్రథమ ప్రాధాన్యమని స్పష్టం చేశారు.

శ్రీకాకుళం జిల్లాలో వలసలను అరికట్టేందుకు పరిశ్రమల స్థాపన అవసరమన్న ఆయన... నియోజకవర్గ తాగునీటి సమస్యకు రూ.620 కోట్లు మంజూరు చేశామన్నారు. జిల్లా ప్రజల 60 ఏళ్ల కల అయిన 'నేరడి బ్యారేజీ'ని 2029 నాటికి వంద శాతం పూర్తి చేసి జిల్లాను సస్యశ్యామలం చేస్తామని మంత్రి హామీ ఇచ్చారు.

## కూకట్‌పల్లి బీఆర్ఎస్ సమావేశంలో పాల్గొన్న కేటీఆర్.. పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం

- మొదటి పేజి తరువాయి

కాంగ్రెస్, బీజేపీలు నమోదు చేయిస్తున్న దొంగ, డూప్లికేట్ ఓట్ల పట్ల బీఆర్ఎస్ శ్రేణులు అప్రమత్తంగా ఉండాలని, ఏ ఒక్క ఓటరును కోల్పోకుండా క్షేత్రస్థాయిలో పక్కాగా పనిచేయాలని కేటీఆర్ దిశానిర్దేశం చేశారు. రాబోయే రోజుల్లో బీఆర్ఎస్ తిరిగి అధికారంలోకి రాగానే హైదరాబాద్ నగరంలో ప్రతి ఇంటికీ 24 గంటల పాటు నిరంతరం తాగునీటిని సరఫరా చేస్తామని హామీ ఇచ్చారు. గతంలో తెలంగాణకు 24 గంటల ఉచిత కరెంట్ ఇచ్చిన ఘనత కేసీఆర్‌దేనని, అదే రీతిలో నగరానికి నిరంతర మంచి నీరు అందించేది కూడా కేసీఆరేనని స్పష్టం చేశారు. కాంగ్రెస్ మార్కు పరిపాలనపై పూర్తి అవగాహన ఉండబట్టే, నగర ప్రజలు గత ఎన్నికల్లో ఆ పార్టీకి ఒక్క సీటు కూడా ఇవ్వలేదని అన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కేసీఆర్ కట్టిన ఫ్లై ఓవర్లు, ఆసుపత్రులు, ప్రభుత్వ భవనాలను ఇప్పుడు కాంగ్రెస్ నేతలు ఓపెన్ చేస్తూ... తామే కట్టామంటూ అబద్ధాలు చెప్పుకుంటున్నారని మండిపడ్డారు. గతంలో తాము కేవలం అభివృద్ధిపైనే దృష్టి పెట్టామని, అయితే ఈసారి అధికారంలోకి వచ్చాక పార్టీ కోసం కష్టపడిన ప్రతి కార్యకర్తకు, నాయకుడికి తగిన ప్రాధాన్యత, గౌరవం కల్పిస్తామని హామీ ఇచ్చారు.

# యువత పారిశ్రామికవేత్తలుగా ఎదిగేందుకు ముందుకు రావాలి

### - జిల్లా కలెక్టర్ పి.రాజాబాబు






**స్టాఫ్ రిపోర్టర్ పెన్ పవర్, ఒంగోలు మే 25**

ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను ఉపయోగించుకుని పారిశ్రామికవేత్తలుగా ఎదిగేందుకు యువత ముందుకు రావాలని జిల్లా కలెక్టర్ పి.రాజాబాబు పిలుపునిచ్చారు. సోమవారం ఒంగోలు మండలం దసరాజుపల్లి గ్రామంలో 5 ఎకరాల విస్తీర్ణంలో సూక్ష్మ, చిన్న, మధ్య తరగతి పరిశ్రమల ( ఎం.ఎస్.ఎం.ఈ) పార్క్ ఏర్పాటుకు శంకుస్థాపన కార్యక్రమంలో స్థానిక శాసనసభ్యులు దామచర్ల జనార్ధన్ రావుతో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా జరిగిన సభలో స్థానికులను ఉద్దేశించి కలెక్టర్ మాట్లాడారు. ప్రకాశం జిల్లాలో రామాయపట్నం పోర్టు, బీపీసీఎల్, ఇండో సోల్, జిందాల్ వంటి పెద్ద పరిశ్రమల రాకతో పారిశ్రామికీకరణ వేగం పుంజుకున్నట్లు చెప్పారు. వీటికి అనుబంధ పరిశ్రమలు కూడా వస్తున్నాయన్నారు. ఈ పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని వాటి అవసరాలు తీర్చేలా ఎం.ఎస్.ఎం.ఈ. పార్కుల ఏర్పాటుకు ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తున్నట్లు తెలిపారు. ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలోనూ ఎం.ఎస్.ఎం.ఈ. పార్కును ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. ఈ క్రమంలో తాజాగా రాష్ట్రవ్యాప్తంగా 38 నియోజకవర్గాలలో వీటిని ఏర్పాటు చేస్తుండగా, ఇందులో ఒంగోలు, కందుకూరు నియోజక వర్గాలు కూడా ఉన్నట్లు తెలిపారు. కందుకూరుకు సంబంధించి అయ్యవారిపల్లిలో 100 ఎకరాలలో, ఒంగోలు నియోజకవర్గానికి సంబంధించి దశరాజుపల్లిలో 5 ఎకరాలలో ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. దసరాజు పల్లిలో ఈ పార్కుకు అవసరమైన రోడ్లు, కల్వర్టులు, డ్రైనేజీలు వంటి మౌలిక సదుపాయాలను రూ.5 కోట్లతో అభివృద్ధి చేస్తామన్నారు. ప్రతి ఇంటి నుంచి ఒక పారిశ్రామికవేత్త తయారు కావాలనేది ప్రభుత్వ లక్ష్యం అన్నారు. ఈ దిశగా కల్పిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని యువతకు కలెక్టర్ పిలుపునిచ్చారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ జిల్లా కేంద్రమైన ఒంగోలుతో ఈ గ్రామానికి అనుసంధానమైన రోడ్లను విస్తరించేలా చర్యలు తీసుకుంటామన్నారు. దశరాజు పల్లి గ్రామంలో ఇప్పటికే దాదాపు కోటి 30 లక్షల రూపాయలతో అభివృద్ధి పనులను చేపట్టినట్లు తెలిపారు. స్థానికుల సూచన మేరకు కరవది, వలేటివారిపాలెం గ్రామాలకు కూడా అనుసంధానం పెంచుతామన్నారు. అన్ని మౌలిక వసతులను ఈ పార్కులో కల్పిస్తామని, ప్రభుత్వం కల్పిస్తున్న ఈ సదుపాయాలను వినియోగించుకుని పారిశ్రామికవేత్తలుగా ఎదిగేందుకు స్థానికులు ముందుకు రావాలని ఆయన పిలుపునిచ్చారు. అనంతరం రాష్ట్రవ్యాప్తంగా 38 ఎం.ఎస్.ఎం.ఈ. పార్కులకు వర్చువల్ విధానంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు విజయవాడ నుంచి శంకుస్థాపన చేసి, ప్రజలను ఉద్దేశించి ప్రసంగించగా దసరాజుపల్లిలో ప్రత్యక్ష ప్రసారాన్ని కలెక్టర్, ఎమ్మెల్యే, ప్రజా ప్రతినిధులు, అధికారులు, గ్రామస్తులు వీక్షించారు. ఈ కార్యక్రమంలో ఏపీఐఐసి జోనల్ మేనేజర్ మదన్, ఆర్డీవో చంద్రశేఖర్ నాయుడు, ఏఎంసీ చైర్మన్ వెంకట్రావు, తదితరులు పాల్గొన్నారు.

# నారాయణస్వామి ఆదివారం ఆదాయం రూ. 2,56,521/- లు

**సి ఎస్ పురం, పెన్ పవర్ మే 25**

జిల్లాలో ప్రసిద్ధిగాంచిన ప్రముఖ పుణ్యక్షేత్రమైన మిట్టపాలెం నారాయణస్వామి దేవస్థానం నకు ఆదివారం ఆదాయం రూ.2,56, 521 /- లు వచ్చినట్లు ఆలయ కార్యనిర్వాహణాధికారి గిరిరాజు నరసింహబాబు తెలిపారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టిక్కెట్లు అమ్మకం ద్వారా రూ. 1,03,860/- లు, లడ్డు ప్రసాదం అమ్మకం ద్వారా రూ.37,400/- లు, శాశ్వత అన్నదానం నకు విరాళంల ద్వారా రూ,48,449/- లు ,మహా ప్రాకార నిర్మాణం నకు రూ.35,232/- లు స్వామివారి పంచామృత అభిషేకమునకు రూ .27,580/- లు, ఇతర విరాళముల ద్వారా రూ. 4,000/- లు వచ్చినట్లు తెలిపారు.

పెన్ పవర్
MARKAPURAM మార్కాపురం
మార్కాపురం - ప్రకాశం

# కృష్ణాపురం రైతుల ముఖాల్లో వెల్లివిరిసిన ఆనందం

**-పొలాలకువెళ్లే దారిలో 40 లక్షలతో బ్రిడ్జినిర్మాణానికి శ్రీకారం**

**-ఎమ్మెల్యే ఇంటూరి చేతుల మీదుగా శంకుస్థాపన -నాగేశ్వరరావు కృషికి అన్నదాతల కృతజ్ఞతలు**





**ఉలవపాడు పెన్ పవర్, మే 25**

మండలంలోని కృష్ణాపురం రైతుల కష్టాలు తీరబోతున్నాయి. ఎలికేరు చెక్ డ్యాం నుంచి చాగొల్లు చెరువుకు వెళ్లే కాలువపై కృష్ణాపురం పొలాల వద్ద బ్రిడ్జి పదేళ్ల క్రితం కూలిపోగా... దాని స్థానంలో 40 లక్షల నిధులతో కొత్తగా బ్రిడ్జి నిర్మించనున్నారు. ఆ పనులకు స్థానిక శాసనసభ్యులు ఇంటూరి నాగేశ్వరరావు సోమవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా రైతన్నలు ఎమ్మెల్యే కి కృతజ్ఞతలు తెలియజేస్తూ, సంతోషాన్ని వ్యక్తం చేశారు. 2015 లో బ్రిడ్జి శిథిలావస్థలో ఉన్నప్పుడే అప్పటి ఎమ్మెల్యేకు తాము తెలియజేశామని, ఊరంతా చందాలు వేసుకొని నిర్మించుకోవాలంటూ ఆయన వ్యంగంగా మాట్లాడారని రైతులు గుర్తు చేసుకున్నారు. బ్రిడ్జి గురించి కనీసం పట్టించుకోకపోతే, తామే తాత్కాలిక రిపేర్లు చేయించుకొని రాకపోకలు కొనసాగిస్తున్నామని తెలిపారు.అనంతరం ఎమ్మెల్యే నాగేశ్వరరావు మాట్లాడుతూ కృష్ణాపురం రైతుల భూములన్నీ ఇటువైపే ఉన్నాయని, బ్రిడ్జి కూలిపోవడంతో పంట ఉత్పత్తులు తెచ్చుకోవడానికి అనేక ఇబ్బందులు పడ్డారని అన్నారు. సమస్య గురించి ఎన్నికలకు ముందు తన దృష్టికి రైతులు అనేకసార్లు తీసుకొచ్చారని చెప్పారు. ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి సహకారంతో, 40 లక్షల రూపాయలతో కొత్తగా బ్రిడ్జి నిర్మించబోతున్నట్లు ఎమ్మెల్యే నాగేశ్వరరావు చెప్పారు. గ్రామాల్లో రోడ్లు, తాగునీరు, డ్రైనేజీ కాలువలు, వీధిలైట్లు, స్మశానాల అభివృద్ధి లాంటి కనీస వసతుల ఏర్పాటుకు తొలి ప్రాధాన్యం ఇస్తున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం అభివృద్ధి బాటలో పయనిస్తుందని, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఏడుపదుల వయస్సులో ప్రజల కోసం పడుతున్న కష్టాన్ని ప్రతి ఒక్కరు గమనించాలని నాగేశ్వరరావు విజ్ఞప్తి చేశారు. సకాలంలో నాణ్యతగా బ్రిడ్జి పనులు పూర్తి చేయాలని కాంట్రాక్టర్ ను ఎమ్మెల్యే ఆదేశించారు. కార్యక్రమంలో గ్రామ టిడిపి అధ్యక్షుడు చక్రవర్తుల విజయ్ కుమార్, నీటిపారుదల శాఖ జేఈ సీతారామయ్య, టీడీపీ నాయకులు మందాడి హనుమంతరావు, కొల్లి శేషయ్య, కోడిపల్లి పోతురాజు, మందాడి ప్రసాద్, నక్కా మస్తాన్, చౌడుబోయిన హరిబాబు, గణపతిరాజు చలపతి, జాజుల రవి, మల్లవరపు కోటిరెడ్డి, లక్కంరాజు వెంకట్రామరాజు, పోలుబోయిన శ్రీను, రాచగర్ల శివ, కూనం బ్రహ్మారెడ్డి, బండి తిరుపతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## దేవుడి కైంకర్యాలకు దాతలు ఇచ్చిన భూములు

# యదేచ్ఛగా అన్యాక్రాంతాలు

- ఆక్రమణ దారులకు పరోక్షంగా కొమ్ము కాస్తున్న దేవాదాయ ధర్మాదాయ శాఖ అధికారులు
- డ్యూ ప్రాసెస్ పేరుతో చేస్తున్న కాలయాపన దేవాదాయ శాఖ అధికారులకు చేరుతున్న లబ్ది
- ఈ భూములు దేవాదాయ ధర్మాదాయ శాఖ కి చెందినవని బోర్డులు ఎందుకు పెడుతున్నారు? అధికారులు చర్యలు గాలికి ఎందుకు వదిలేస్తున్నారు?
- స్వాధీనం, పరిరక్ష గాలికి వదిలి ఆక్రమణ అన్యాక్రాంతం చేస్తున్న వారి పై చర్యలు క్రిమినల్ కేసులు ఏవీ?
- ప్రభుత్వం ఏదైనా ప్రభుత్వ పెద్దల నీడలో యదేచ్ఛగా సాగుతున్న దేవాదాయ భూముల ఆక్రమణ
- ఆక్రమణ దారులు చూపుతున్న దస్తావేజులు ఎట్లా వచ్చాయి ?
- దేవుడు భూములు ఎవరు చెలామణి లావాదేవీలు ఎవరు చేశారు?
- భూమి దేవాదాయ ధర్మాదాయ శాఖ కి చెందినది అయితే ఆక్రమణ దారులపై నమోదయిన కేసులు ఏవీ?
- జిల్లా కలెక్టర్ ఆదేశించిన దేవాదాయ ధర్మాదాయ శాఖ కి చెందిన ఖాళీ స్థలాల సర్వే ఏమయింది?
- ఎందుకు చేపట్టలేదు? కుంటి సాకులు ఎందుకు చెప్తున్నారు అంటే దేవాదాయ ధర్మాదాయ శాఖ దగ్గర సమాధానం ఏది?
- సింగరాయకొండ లో పెట్రేగి పోతున్న దేవాదాయ ధర్మాదాయ శాఖ భూముల ఆక్రమణ దారులను నివారించే వారు ఏరీ?
- నిద్ర పోతున్న హిందూ సంఘాలు, దేవాలయ పరిరక్షణ సమితి, తిరుపతి కి చెందిన అనువంశిక ధర్మ కర్త శ్రీమాన్ రామానుజ చిన్న జియ్యంగార్.
- వరాహ లక్ష్మి నారసింహ స్వామి భూముల పరిరక్షణకి తీసుకున్న చర్యలు ఏవీ?





**సింగరాయకొండ, మే 25, పెన్ పవర్**

దక్షిణ సింహాచలం పాత సింగరాయకొండ నవ నరసింహ క్షేత్రాలలో ప్రసిద్ధి చెందిన శ్రీ శ్రీ శ్రీ యోగానంద లక్ష్మి నారసింహ శ్రీ శ్రీ శ్రీ వరాహ లక్ష్మి నారసింహ క్షేత్రం నిర్వహణ నిత్య కైకర్యాలు, ఆగమ వైదిక సేవల కొరకు దాతలు స్వామివారి సేవకి ఇచ్చిన భూములకు రక్షణ పరిరక్షణ కరువైంది.రెవెన్యూ, దేవాదాయ ధర్మాదాయ శాఖ దస్త్రాలలో వేల ఎకరాలు, వందలాది భూములు నిక్షిప్తం అయి ఉన్నాయి. చెప్పుకోవడానికి వేల ఎకరాలు ఉన్నా స్వామివారి ఆలయ అభివృద్ధి, వార్షిక బ్రహ్మోత్సవాలు, పవిత్రోత్సవాలు, విశేష పూజలు కార్యక్రమాల కొరకు భక్తుల వద్ద కొంగుజాపక తప్పడం లేదు. ఆలయ నిర్వహణ సిబ్బంది జీత భత్యాలు, విశేష ఉత్సవాలు నిర్వహణ కి ఉన్న భూములలో దేవాదాయ ధర్మాదాయ శాఖ అధికారుల, ప్రభుత్వ పెద్దలు, రాజకీయ నాయకుల చర్యలతో దాతలు స్వామి వారి సేవలు చేసి అనుభవించాల్సిన భూములు, ఇతర భూముల అక్రమ లావాదేవీలు, చెలామణులు, దేవాదాయ ధర్మాదాయ శాఖ అధికారుల, స్వామివారి సేవకుల చేతివాటం కారణంగా భూములు అన్యాక్రాంతం అవుతున్నా వాటిని కాపాడుకునే స్థితిలో దేవాదాయ ధర్మాదాయ శాఖ అధికారులు లేరంటే అతిశయోక్తి లేదు. ప్రకాశం జిల్లా కొండపి నియోజకవర్గం సింగరాయకొండ మండలం తో పాటు వివిధ రాష్ట్రాలలో నారసింహ స్వామి వారి భూములు ఉన్నాయి.ఇతర ప్రాంతాల్లో ఉన్న భూములు సరే సోమరాజు పల్లి, సింగరాయకొండ, పాత సింగరాయకొండ గ్రామాల లో ప్రత్యేకించి వేల ఎకరాల లో స్వామి వారి భూములు ఉన్నాయి. ఉన్న భూములు దేవాదాయ ధర్మాదాయ శాఖ కి చెందిన వని దేవాదాయ ధర్మాదాయ శాఖ దస్త్రాలు, రెవెన్యూ శాఖ రాష్ట్రాల ప్రకారం దేవాదాయ ధర్మాదాయ శాఖ కి చెందిన భూమి గా నమోదు కావడం తో సంవత్సరాలుగా అధికారికంగా భూముల లావాదేవీలు, క్రయ విక్రయాలు నిలిచి పోయాయి. అయితే దేవాదాయ ధర్మాదాయ శాఖ భూములుగా చెప్పే భూములు వారివి కాదని దేవాదాయ పరిధిలో స్వామి వారి చేసే వారికి చెందిన ఇనామ్ భూములు,ఇతర భూములకు, 99 సంవత్సరాల లీజు కి తీసుకున్న భూములు ఏవిధంగా ప్రయివేటు వ్యక్తుల ఆస్తులు ఎలా అయ్యాయి అనేదానికి దేవాదాయ శాఖ దగ్గర సమాధానం దొరకడం లేదు. అప్పట్లో సోమరాజు పల్లి గ్రామ సర్వే నంబర్ ప్రకారం సింగరాయకొండ ఆర్ ఎస్, సోమరాజుపల్లి లో దాతలు స్వామి వారి సేవల కోసం ఇచ్చిన భూములను స్వామి వారి సేవకుల నుండి పద్మనాభుని నారాయణప్ప తో పాటు పలువురు వ్యాపార వేత్తలు తీసుకున్న 99 సంవత్సరాల లీజు ఆస్తుల క్రయ విక్రయాలు, చెలామణి చేయడం తో ప్రారంభం అయిన దేవాదాయ ధర్మాదాయ శాఖ భూములు అన్యాక్రాంతం, అక్రమ చెలామణి లావాదేవీలు నేటికీ చోటు చేసుకుంటున్నాయి. దానిలో భాగంగా సింగరాయకొండ గ్రామ పంచాయతీ పరిధిలోని ఊళ్ల పాలెం వేములపాడు రోడ్డు లో తహసీల్దారు కార్యాలయానికి ఎదురుగా ఉన్న సర్వే నంబర్ 607/2.98 భూమి దేవాదాయ శాఖ కి చెందినదని స్థానిక దేవాదాయ ధర్మాదాయ శాఖ అధికారులు సిబ్బంది స్వయంగా హెచ్చరిక బోర్డు పెట్టి చర్యలు చేపట్టారు. అది మొదలు నరసింహ నగర్, దేవుడి బాట లో తుఫాన రక్షణ భవనం ఎదురుగా ఉన్న భూమి లో దేవాదాయ ధర్మాదాయ శాఖ హెచ్చరిక బోర్డ్ పెట్టింది. అక్రమం లో నే దేవాదాయ ధర్మాదాయ శాఖ సహాయ కమీషనర్ పానకాల రావు ప్రత్యక్ష పర్యవేక్షణ లో ఇవో పాతకోట కృష్ణవేణి, సిబ్బంది సింగరాయకొండ కూరగాయల మార్కెట్, మసీదు రోడ్డు వద్ద భవన దుకాణ సముదాయాల ఆక్రమణ పై చర్యలు చేపట్టి ఆభూమి దేవాదాయ ధర్మాదాయ శాఖ భూమి అంటూ బోర్డు పెట్టారు. అదేవిధంగా జాలమ్మ చెట్టు ఎదురుగా, కందుకూరు రోడ్డు లో స్మార్ట్ పాయింట్ వద్ద బోర్డు లు ఏర్పాటు చేశారు. అదేవిధంగా పాకల రోడ్డు, ట్రంక్ రోడ్డు లలో దేవాదాయ భూమిని స్వయంగా పరిశీలించిన సహాయ కమీషనర్ హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేశారు. దేవాదాయ శాఖ పేర్కొన్న విధంగా ఆక్రమణ దారులు దేవాదాయ ధర్మాదాయ శాఖ హెచ్చరికలను గాలికి వదిలి అబోర్డులను పెరికి అవతల పడేశారు. అంతే కాకుండా దేవుడి బాట లో సోమరాజుపల్లి తుఫాను భవనం ఎదురుగా ఉన్న భూమి లో ప్రైవేటు వ్యక్తులు వెంచర్ వేయడం తో దేవధ ధర్మాదాయ శాఖ అధికారులు హెచ్చరిక బోర్డ్ ఏర్పాటు చేశారు. అయితే ఆ బోర్డ్ ను భూమి ఆక్రమణ దారులు తొలగించి యధా తథంగా ఆ భూమిని స్వాధీనం లో ఉంచుకున్నారు. ఇదిలా ఉండగా ఇటీవల రెండు మూడు రోజుల దగ్గరనుండి సింగరాయకొండ లో పాకల రోడ్డు ట్రంక్ రోడ్డు పక్కన ఉన్న విలువైన భూమి దేవాదాయ ధర్మాదాయ శాఖ కి చెందినదని అధికారులు చాటుతూ హెచ్చరికలు చేసినా ఆభూమి సంబంధిత ఇనాము దారులనుండి సంక్రమించింది అని కొందరు వాదిస్తూ ఏకంగా గ్రావెల్ రోడ్డు ఏర్పాటు చేశారు. ఇక్కడే అసలైనటిస్ట్ చోటు చేసుకుంది.ఎప్పుడైనా అప్పటి ప్రభుత్వాల లో హవా సాగించే వ్యక్తులు వారి వారి రాజకీయ, ఆర్థిక బలంతో ఈ భూమి పై హక్కులు పొందేందుకు చేస్తున్న చర్యలు దేవాదాయ ధర్మాదాయ శాఖ అధికారుల పై వత్తిడికి, ప్రలోభాలకు దారి తీస్తున్నాయి. కొంత కాలంగా చప్పుడు లేకుండా ఉన్న ఈ భూమి వ్యవహారం లో ప్రభుత్వ పెద్దల ఆశీస్సులు ఉన్న వారు దేవాదాయ ధర్మాదాయ శాఖ సహకారంతో స్పందన తెలుసుకునేందుకు చేసిన ప్రయత్నం ఒక్కసారిగా చర్చనీయాంశం అయింది. ఈ కదలికతో మేము నిద్రపోవడం లేదు మేల్కొనే ఉన్నాం అంటూ దేవాదాయ శాఖ అధికారి తమ సిబ్బంది తో కలిసి సదరు భూమి లోకి వెళ్ళి ఆభూమిలో వేసిన గ్రావెల్ రోడ్డును ధ్వంసం చేసి యధా ప్రకారం తమ ప్రతాపం చూపిస్తూ హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేశారు. బోర్డు ఏర్పాటు తో తమ పని అయినట్లు చేతులు దులుపుకుపోయారు. తమ భూమిలో ప్రవేశించి పనులు చేపట్టిన ఆక్రమణ దారులుగా చెప్తున్న వారి పై ఎలాంటి క్రిమినల్ కేసులు పెట్టేందుకు సాహసం అయితే చెయ్యడం లేదు. ఈ భూమి కి ఎవరు యాజమాన్య హక్కుదారులు, అనేది అర్థం కావడం లేదు. దేవాదాయ ధర్మాదాయ శాఖ అధికారులు మాత్రం ఎవరి మెప్పు కోసమో? ఎవరికి లబ్ది చేకూర్చడానికొ? హెచ్చరిక బోర్డు పెట్టడం వాటిని తొలగించినా చర్యలు తీసుకోక పోవడం, ఎవరో ఏదో ఆరోపణ చేస్తారో, విమర్శలు వస్తాయో, ఉద్యోగులుగా తమకి బాధ్యత ఉందని చెప్పుకోవడానికో తెలీదు గాని భూమి దేవాదాయ ధర్మాదాయ శాఖ కి చెందినదని బోర్డు లు పెట్టడం ఫోటోలు తీసి మీడియాకు అధికారులకు పంపడం తో సరి పోతుంది.దేవాదాయ ధర్మాదాయ శాఖ నిర్లక్ష్యం గురించి ఇక్కడ చెప్పుకోక తప్పదు. జిల్లా కలెక్టర్ రాజ బాబు బాధ్యతలు చేపట్టిన తొలినాళ్ళ లోనే దేవాదాయ శాఖ కి, రెవెన్యూ శాఖ అధికారులకు ఆదేశాలిస్తూ సింగరాయకొండ లో చోటు చేసుకున్న పరిస్థితులు కారణంగా దేవాదాయ ధర్మాదాయ శాఖ కి సంబంధించిన ఖాళీ స్థలాల సర్వే చేసి పూర్తి వివరాలు సమర్పించాలని ఆదేశించినా వాటి అమలు విషయం లో చేస్తున్న నిర్లక్ష్యమే దేవాదాయ శాఖ భూముల ఆక్రమణలు, అక్రమ నిర్మాణాల జోరు కి దారితీస్తున్నాయి. ఇప్పటి కైన కలెక్టర్ ఎండోమెంట్ స్పందించి స్వయంగా స్థానిక దేవాదాయ శాఖ అధికారులతో సమీక్షించి స్వామి వారి ఆస్తులు భూములు అన్యాక్రాంతం, ఆక్రమణలకు గురి కాకుండా చర్యలు తీసుకోవాలని నరసింహస్వామి భక్తులు కూర్చున్నారు.

# బయ్యర్ల సిండికేట్ తో రైతులకు అన్యాయం

-పొగాకు కొనుగోలు చేయకపోతే బోర్డు మూసేయండి
-మేము వస్తున్నామని 7 గంటలకే వేలం ప్రారంభిస్తారా
-పొగాకు పంటకు గిట్టుబాటు ధర కల్పించాలి
-రైతులు పండించిన పొగాకు మొత్తాన్నీ కొనుగోలు చేయాలి
-రైతులకు అన్యాయం జరిగితే ఆమరణ నిరాహార దీక్ష చేస్తా
-మాజీ శాసనసభ్యులు బుర్రా మధుసూదన్ యాదవ్











**కందుకూరు పెన్ పవర్, మే 25**

అన్ని కంపెనీల బయ్యర్లు సిండికేట్ అయ్యి రైతులకు అన్యాయం చేస్తున్నారని పొగాకు రైతుకు గిట్టుబాటు ధర కల్పించాలని మాజీ శాసనసభ్యులు వైకాపా ఇంచార్జ్ బుర్రా మధుసూదన్ యాదవ్ అన్నారు. స్థానిక పామూరు రోడ్ లోని 27వ నెంబర్ వేలం కేంద్రమును సందర్శించిన వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి బుర్రా మధుసూదన్ యాదవ్ మాట్లాడుతూ మేము వస్తున్నామని 7 గంటలకే వేలం ప్రారంభించి ముగిస్తారా రేపు వస్తాను అలాగే చేస్తారా ఎల్లుండి వస్తాను అలాగే చేస్తారా ఇది మంచి పద్ధతి కాదు హెచ్చరించారు. ఎన్నో వ్యయ ప్రయాసలకు ఓర్చి పంట పండించిన రైతుకు సరైన ధర రాక పంట అమ్ముకునే పరిస్థితి లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. చంద్రబాబు నాయుడు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఏ పంటకు గిట్టుబాటు ధర లేక రైతులంతా ఉరి వేసుకునే పరిస్థితి దాపురించిందని అన్నారు. కందుకూరు ప్రాంతంలోని వేలం కేంద్రాల్లో బయ్యర్స్ అందరూ సిండికేట్ అయ్యి రైతులకు అన్యాయం చేస్తున్నారు. దీనిని గురించి బోర్డు అధికారులను అడిగితే వారు సరైన సమాధానం చెప్పకుండా చేతులు దులుపుకుంటున్నారు. పెరిగిన ధరలు పెట్టుబడి ఖర్చులు కూలీలు బ్యార్నీ రెంటలు, ట్రాన్స్పోర్ట్ ఖర్చుల వలన రైతులకు తడిసి మోపిడవుతుంది అని అన్నారు. పెట్టిన పెట్టుబడులు కూడా వచ్చే పరిస్థితి లేదు అని ఆవేదన వ్యక్తం చేశారు. అప్పులు తెచ్చి వడ్డీలు కట్టలేక రైతులు నానా ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. కందుకూరు ప్రాంతంలోని రైతులందరూ పార్టీల కతీతంగా ఏకంగా గిట్టుబాటు ధర కోసం మీతో కలిసి వస్తాం అంటూ రైతు కూలీలు నష్టపోకూడదనేది మా ఉద్దేశం అని ముక్త కంఠంతో చెబుతున్నారు అని అన్నారు. రైతుకు న్యాయం జరిగే వరకూ అవసరమైతే రైతుల పక్షాన ఆమరణ నిరాహార దీక్ష చేస్తానని అని అన్నారు. గత ప్రభుత్వం జగనన్న హయాంలో మార్క్ ఫెడ్ ద్వారా ప్రతి పంటను కొనుగోలు చేసి రైతుకు గిట్టుబాటు ధర కల్పించారని,తక్షణమే కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు జోక్యం చేసుకొని రైతు సహకార సంఘాల ద్వారా రైతు పండించిన పంటకు గిట్టుబాటు ధర కల్పించే విధంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ ప్రాంతంలోపొగాకు మొక్క నాటిన కాడ నుండి వేలంకు వచ్చేవరకు ఖర్చులు పెరిగిపోయాయని మొక్కలు నాటడం, పొగాకు కొట్టుడు కూలీలు , బ్యారన్ రెంటులు, ట్రాన్స్పోర్ట్ ఖర్చులు తడిసి మోపుడు అవుతున్నాయి అని అన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు వేలం పాటలో జోక్యం చేసుకొని రైతుకు మద్దతు ధర ప్రకటించాలి.

**మార్క్ పెడ్ (రైతు సహకార సంఘాలు) ద్వారా గిట్టుబాటు ధరలకు పొగాకు పంట కొనాలి.**

మా వైసీపీ ప్రభుత్వం మాదిరిగా రైతు స్థిర నిధి ఏర్పాటు చేయాలి అని అన్నారు. రైతు సహకార సంఘాల ద్వారా పంటలను కొనాలి పొగాకు రైతు నిల్వ చేసుకునేందుకు గిడ్డంగులను రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. మా ప్రభుత్వం ఉన్నప్పుడు ఈక్రాప్ నమోదు ద్వారా పంట నష్టం జరిగినప్పుడు వెంటనే నష్టపరిహారం రైతుల ఖాతాల్లోనే జమ అయ్యేవిధంగా చెల్లించడం జరిగింది అని అన్నారు. ఈ కూటమి ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి గత ప్రభుత్వంలో ప్రవేశపెట్టిన ఈ క్రాపింగ్ వ్యవస్థను పూర్తిగా నిర్వీర్యం చేశారని విమర్శించారు. కొంతమంది రైతులు సరైన ధర రావటం లేదని పొగాకు బేళ్ళను తగలబెట్టడానికి ప్రయత్నించగా పోలీసులు రైతుల మధ్య తోపులాట జరిగినది బోర్డు దగ్గర ఉద్రిక్త పరిస్థితులు ఏర్పడినవి. ఈ కార్యక్రమంలో ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షులు పండిత్ కామరాజు, పట్టణ అధ్యక్షులు షేక్ రఫీ, జిల్లా జనరల్ సెక్రెటరీ తోకల కొండయ్య,రాష్ట్ర బూత్ జాయింట్ సెక్రెటరీ గణేశం గంగిరెడ్డి, చీమల రాజా, అప్పనబోయిన రాజేష్, వంకాయలపాటి వెంకటేశ్వర్లు, ఉప్పుటూరి నాగేశ్వరరావు, జిల్లా అధికార ప్రతినిధి ముప్పవరపు కిషోర్, ఉలవపాడు మండల అధ్యక్షులు నన్నం పోతురాజు వలేటివారిపాలెం మండల అధ్యక్షులు అనుమూల లక్ష్మి నరసింహ, లింగసముద్రం మండల అధ్యక్షులు నోటి వెంకటేశ్వర్ రెడ్డి లింగసముద్రం ఎంపీపీ పెన్నా. కృష్ణయ్య, జిల్లా సెక్రెటరీ చీమల వెంకటరాజా, జిల్లా వర్కింగ్ సెక్రెటరీ పాశం కొండయ్య,రాష్ట్ర కల్చరల్ విభాగం అధికార ప్రతినిధి వల్లూరి కోటేశ్వరరావు, జిల్లా ఉపాధ్యక్షులు బిల్లా రమణయ్య, ఐ టీవింగు పాలవెల్లి అమర్నాథరెడ్డి, సోషల్ మీడియా వింగ్ అధ్యక్షులు కాపులూరి మధుసూదన్,ఎస్సీ సెల్ పట్టణ అధ్యక్షులు చనమాల కోటేశ్వరరావు, రైతు సంఘం అధ్యక్షులు చెన్నారెడ్డి వెంకటేశ్వర్లు,జిల్లా అధికార ప్రతినిధి బద్దిపూడి జయరావు, రైతువింగు నాయకులు చింతం వెంకారెడ్డి, కట్టా హనుమంతరావు, గుడ్లూరు ఉపాధ్యక్షులు కాట్రగడ్డ వెంకట్రావు, కొత్త మహేష్ షేక్ దస్తగిరి,గొర్ల రమేష్,ఈర్ల. వెంకటేశ్వర్లు పట్టణ ఉపాధ్యక్షులు యడ్ల మాధవరెడ్డి, తలపనేని గోపి, పత్తిపాటి శ్రీనివాసులు, గోకరాజు సుబ్బారావు, అన్నా బత్తిని మాల్యాద్రి, కొండూరు.నర్సారెడ్డి నియోజకవర్గ మహిళానేతలు తన్నీరు.ధరణి,లక్ష్మి, ఆదాంభీ తదితరులు పాల్గొన్నారు. 27 వ నెంబర్ ఆక్షన్ నిర్వహణ అధికారికి వినత పత్రం అందజేశారు.

## రైతు సదస్సులో పాల్గొన్న కదిరి బాబురావు వ్యవసాయ కళాశాల విద్యార్థులు



**సి ఎస్ పురం పెన్ పవర్ మే 25**

నెల్లూరులోని రెబాలలో రావెప్ విద్యార్థులచే రైతు సదస్సు సోమవారం జరిగింది. ఈ సదస్సు లో సియస్ పురం కదిరి బాబురావు వ్యవసాయ కళాశాల లో నాల్గొవ సంవత్సరం చదువుతున్న విద్యార్థులు పాల్గొని వివిధ వ్యవసాయ సాంకేతికతల నమూనాలు, చార్టులను ప్రదర్శించారు. అలాగే రైతుల భాగస్వామ్యంతో వ్యవసాయ పద్ధతులు, సాంకేతికతలు మరియు రైతు సంక్షేమ కార్యక్రమాలపై అవగాహన కలిపించారు.

## గిద్దలూరు మాజీ వైసిపి ఇన్ ఛార్జ్ ఐ వి రెడ్డికి పితృ వియోగం



**గిద్దలూరు పెన్ పవర్ మే 25**

గిద్దలూరు మాజీ వైసీపీ ఇన్ ఛార్జ్ ప్రస్తుత వైసిపి నేత ఐ.వి రెడ్డి తండ్రి ఇల్లూరి పుల్లారెడ్డి (86) వయోభారంతో సోమవారం మృతి చెందారు. అనారోగ్య సమస్యలతో కొద్ది రోజులుగా హైదరాబాదులోని ఓ ప్రైవేటు వైద్యశాలలో పుల్లారెడ్డి చికిత్స పొందుతున్నారు. ఆరోగ్యం మరింత క్షీణించి ఆయన మృతి చెందారు. పలువురు నేతలు కార్యకర్తలు పుల్లారెడ్డి మృతికి సంతాపం తెలిపారు. పుల్లారెడ్డి అంత్యక్రియలను ఈనెల మే26న ఉదయం 11 గంటలకు ఐవీ రెడ్డి స్వగ్రామమైన గిద్దలూరు మండలం క్రిష్టం శెట్టిపల్లి గ్రామంలో నిర్వహిస్తామని ఐవీ రెడ్డి తెలిపారు.

## కాంగ్రెస్ పార్టీ అభివృద్ధికి తోడ్పడండి

### డాక్టర్ షేక్ మహబూబ్ వలీ



**మార్కాపురం పెన్ పవర్ మే25**

కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి బలంగా తీసుకువెళ్లి పార్టీ అభివృద్ధి కోసం కృషి చేయాలని కాంగ్రెస్ పార్టీ మైనార్టీ సెల్ చైర్మన్ డాక్టర్ షేక్ మహబూబ్ వలీ నూతనంగా పార్టీ లో చేరిన వారిని కోరారు.సోమవారం పట్టణంలోని తన కార్యాలయంలో పార్టీలో చేరిన వారికి పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు.పార్టీ లో చేరిన షేక్ మొహమ్మద్ అనీస్,దూదేకుల జాకీర్ భాష,బేతం లక్ష్మయ్య, సయ్యద్ మౌలాలిల కు డాక్టర్ షేక్.మహబూబ్ వలి శుభాకాంక్షలు తెలిపారు.ఈ నేపథ్యంలో డాక్టర్ షేక్ మహబూబ్ వలి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ రానున్న రోజుల్లో ఉమ్మడి ప్రకాశం జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు షేక్ సైదా సారద్యం లో పెద్ద ఎత్తున కాంగ్రెస్ పార్టీలో చేరబోతున్నారని తెలిపారు.కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తేనే దేశాభివృద్ధి,సోదర భావం పెంపొందుతుందని వెల్లడించారు.2014 కు ముందు కాంగ్రెస్ పార్టీ హయాంలో నిత్యవసర ధరలు సామాన్యులకు అందుబాటులో ఉన్నాయని తెలిపారు.తద్వారా ప్రతి కుటుంబం కూడా సుఖ సంతోషాలతో ఉన్నారని తెలిపారు.నేటి బిజెపి ప్రభుత్వ పాలన లో పేదవాడు జీవనం గడపాలంటే చాలా దుర్భరంగా మారిందని పేర్కొన్నారు.నిత్యవసర వస్తువులు గ్యాస్,డీజిల్ పెట్రోల్ వంటి ధరలు విపరీతంగా పెరిగాయని ఆవేదన వ్యక్తం చేశారు.నిత్యావసర వస్తువుల ధరలను తగ్గించి సామాన్యులపై భారం లేకుండా చూడాలని ప్రభుత్వాన్ని డాక్టర్ షేక్ మహబూబ్ వలీ కోరారు.

# ప్రజల సంతృప్తే లక్ష్యం

### - జిల్లా కలెక్టర్ పి.రాజాబాబు





**కలెక్టరేట్ పెన్ పవర్, ఒంగోలు మే 25**

ప్రజల సంతృప్తే లక్ష్యంగా మీకోసం అర్జీలను సహేతుకంగా, సకాలంలో పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ పి.రాజాబాబు స్పష్టం చేశారు.

సోమవారం ప్రకాశం భవనంలోని గ్రీవెన్స్ హాలులో నిర్వహించిన "ప్రజా సమస్యల పరిష్కార వేదిక" ( మీకోసం ) కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ కల్పనా కుమారి, జిల్లా రెవెన్యు అధికారి శ్రీధర్ రెడ్డి, ఎస్.డీ.సీ.లు కళావతి, మాధురి, డిపిఓ వెంకటేశ్వరరావు లతో కలసి పాల్గొని ప్రజల నుంచి ఆయన అర్జీలను స్వీకరించారు. వచ్చిన అర్జీలను ఆయా శాఖల అధికారులకు సూచిస్తూ సత్వరం పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి అర్జీని సంబంధిత శాఖల అధికారులు క్షుణ్ణంగా పరిశీలించి, సత్వరం పరిష్కరించడంతో పాటు అర్జీదారులు సంతృప్తి చెందేలా అర్జీల పరిష్కారం ఉండాలన్నారు. ఏదైనా కారణంగా ఫిర్యాదు పరిష్కారం సాధ్యం కాకపోతే, దానికి గల కారణాలను అర్జీదారునికి అర్ధమయ్యే విధంగా ఎండార్స్‌మెంటు ఇవ్వాలని సూచించారు. ప్రజా సమస్యలు పరిష్కారంలో ఎటువంటి నిర్లక్ష్యం చూపకూడదన్నారు. అధికారి తీసుకున్న చర్యలతో అర్జీదారుడు సంతృప్తి చెందాలని, ఎట్టి పరిస్థితుల్లోనూ ఫిర్యాదులు మళ్లీ రీ-ఓపెన్ కాకూడదని, ఒకవేళ ఏదైనా అర్జీ రీ-ఓపెన్ అయితే సంబంధిత అధికారి తప్పనిసరిగా క్షేత్రస్థాయిలో పర్యటించి, పరిస్థితిని సమీక్షించాలని కచ్చితమైన ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో 286 అర్జీలు వచ్చాయి. వివిధ శాఖలకు చెందిన జిల్లా అధికారులు ఇందులో పాల్గొన్నారు.

# పోలీస్ మీకోసం లో 66 ఫిర్యాదులు



**క్రైమ్ రిపోర్టర్ పెన్ పవర్, ఒంగోలు మే 25**

ప్రకాశం జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణతో పాటు ప్రజల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించిన మీకోసం కార్యక్రమంలో జిల్లా ఎస్పీ వి. హర్షవర్ధన్ రాజు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 66 ఫిర్యాదులు అందాయి. ఫిర్యాదులను చట్టపరిధిలో త్వరితగతిన పరిష్కరిస్తామని బాధితులకు భరోసా కల్పించారు. నడవలేని వారి వద్దకు జిల్లా ఎస్పీ స్వయంగా వెళ్లి వారి సమస్యలను తెలుసుకొని, సంబంధిత అధికారులకు తగిన ఆదేశాలు జారీ చేశారు. ప్రత్యేకంగా వికలాంగులు, వృద్ధులు, మహిళల సమస్యలకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో వచ్చిన ఫిర్యాదులపై సంబంధిత పోలీస్ స్టేషన్ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్, ఫోన్ ద్వారా జిల్లా ఎస్పీ తక్షణమే ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో మహిళ పోలీస్ స్టేషన్ డిఎస్పీ పి.శ్రీధర్, ఒంగోలు ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ సి.హెచ్. హాజరత్తయ్య, సంతమాగులూరు సీఐ శేషగిరి రావు,కొండేపి సీఐ రమణయ్య, ప్యానెల్ అడ్వొకేట్ బి.బాలాజీ సింగ్, సమస్యల పరిష్కార వేదిక ఎస్సై జనార్దన్ రావు, సిబ్బంది పాల్గొన్నారు.

# గణేష్ ని పల్లి ఆర్జీసీఎం చర్చ్ ఫాదర్ బదిలీ

### కన్నీటి వీడ్కోలు పలికిన గ్రామస్తులు





**సి ఎస్ పురం, పెన్ పవర్ మే 25**

మండలంలోని గణేష్ ని పల్లి ఆర్జీసీఎం చర్చ్ ఫాదర్ రేవ్. ఫా. బి మనోహర్ బదిలీ ఐన సందర్భంగా అక్కడి క్రైస్తవులు సోమవారం కన్నీటితో వీడ్కోలు పలికారు గత ఐదు సంవత్సరాలుగా చర్చ్ అభివృద్ధికి కృషి చేసినారు ఫాదర్ ఆధ్వర్యంలో చర్చ్ ఆధ్యాత్మిక కార్యక్రమాలతో పాటు సామాజిక సేవా కార్యక్రమాలు పేద ప్రజలను ఆదుకోవడం పేదవారికి చదువు కు సహాయం చేయడం. పేదవారికి బియ్యం, కూరగాయలు పంపిణీ చేయడంతో పాటు అనారోగ్య బాధితులకు సహాయ సహకారాలు అందించారని పేర్కొన్నారు. యువతకు డ్రాయింగ్, నైపుణ్య శిక్షణ కార్యక్రమాలు నిర్వహించి ఉపాధి అవకాశాలకు దోహదపడ్డారని వివరించారు. అలాగే గ్రామంలోని పేద విద్యార్థులకు చదువులో ప్రోత్సాహం అందిస్తూ విద్యా సామగ్రి పంపిణీ చేసినట్లు తెలిపారు. డ్రైవింగ్ స్కూల్ ద్వారా సుమారు 50 మందికి డ్రైవింగ్ నేర్పి యున్నారు అలాగే చుట్టూ ప్రక్కల గ్రామాల్లో ఎన్నో ఏసు ప్రభు కట్టడంలు నిర్మించారని, క్రైస్తవులకే కాకుండా హిందూ ముస్లిం సహోదరులతో ఎంతో అనుబంధం కలిగి యున్నారని కొనియాడారు ఈ కార్యక్రమంలో రాష్ట్ర మానవ హక్కుల సంఘం అధ్యక్షుడు డాక్టర్ షేక్ గౌస్,ఆర్ఎంపీ వైద్యులు షేక్ గౌస్ భాషా, ఎస్ సి సెల్ నాయకులు గంగిపోగు రమేష్, పట్టపు మోజేష్, లక్కిపోగు ఆనందరావు,రెడ్డిచర్ల ప్రభు దానం, మామిడి రాజశేఖర్, నరేష్, భాస్కర్, నాగార్జున మరియు ఆరు గ్రామల పలువురు ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# అసాంఘిక కార్యకలాపాలను కట్టడి చేయాలి

## - జిల్లా ఎస్పీ వి. హర్షవర్ధన్ రాజు

## - ప్రకాశం, మార్కాపురం జిల్లాల పోలీసు అధికారులతో జిల్లా ఎస్పీ నేర సమీక్షా సమావేశం






**క్రైమ్ రిపోర్టర్ పెన్ పవర్, ఒంగోలు మే 25**

పెండింగ్ లో ఉన్న గ్రేవ్ అండ్ నాన్ గ్రేవ్ కేసులు దర్యాప్తు వేగవంతం చేయాలని పోలీసు అధికారులను జిల్లా ఎస్పీ వి.హర్షవర్ధన్ రాజు ఆదేశించారు. ప్రకాశం, మార్కాపురం జిల్లాలోని డిఎస్పీలు, సిఐలు, ఎస్సైలతో సోమవారం జిల్లా ఎస్పీ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా నేర సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో గ్రేవ్ అండ్ నాన్, దొంగతనం, స్నాచింగ్, మిస్సింగ్, 174 సిఆర్పీసీ, రోడ్డు ఆక్సిడెంట్ కేసులపై, ఇతర అంశాలపై సమీక్షించారు. ఈ సమీక్షా సమావేశంలో ఎస్పీ పోలీస్ స్టేషన్ల వారీగా పెండింగ్ కేసులు, అరెస్టులు, దర్యాప్తు పురోగతిపై అధికారులతో సమీక్ష నిర్వహించి, కేసుల ఛేదన, పరిష్కారం, నేర నియంత్రణకు సంబంధించిన పలు సూచనలు చేశారు. యూఐ కేసులు తగ్గించి, పెండింగ్ కేసులు, చార్జ్‌షీట్లు, నాన్ బెయిలబుల్ వారెంట్లను త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. ప్రతి కేసులో టెక్నికల్ ఎవిడెన్స్ సేకరణపై దృష్టి పెట్టి, కన్విక్షన్ రేటును పెంచాలన్నారు. ప్రాపర్టీ, చైన్ స్నాచింగ్, దేవాలయ నేరాల జరిగినప్పుడు వెంటనే దర్యాప్తు మొదలు పెట్టాలని, సాంకేతిక పరిజ్ఞానంతో నిందితులను త్వరగా పట్టుకోని ప్రాపర్టీ రికవరీ శాతాన్ని పెంచాలన్నారు. చెడు, నేర చరిత్ర గల వ్యక్తులపై ప్రత్యేక నిఘా మరియు ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. మిస్సింగ్ కేసులలో ఫేస్ రికగ్నిషన్ టెక్నాలజీ వినియోగించి బాధితులను త్వరగా గుర్తించే చర్యలు తీసుకోవాలని సూచించారు. నేరస్తుల ట్రాకింగ్, దొంగిలించబడిన వాహనాలను ఆధునిక సాంకేతిక వ్యవస్థ ను ఇంకా ఉపయోగించాలన్నారు. దర్యాప్తులో పారదర్శకత కోసం ఈ-సాక్ష్య యాప్ వినియోగాన్ని పెంచాలని ఆదేశించారు. జిల్లాలో గుర్తుతెలియని మృతదేహాలు, కారణం తెలియని మరణం కేసులు, అనుమానాస్పద మృతి కేసులపై ప్రత్యేక దృష్టి సారించాలని, ఆయా కేసుల్లో అన్ని కోణాల్లో దర్యాప్తు చేసి పూర్తిస్థాయిలో సాక్ష్యాధారాలు సేకరించాలని, ఆర్ఎఫ్ఎస్ఎల్, ఎఫ్ఎస్ఎల్ రిపోర్టులను త్వరితగతిన తెప్పించుకుని పరిష్కరించాలని ఆదేశించారు. రహదారి ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని, ప్రమాదాలు ఎక్కువగా జరిగే ప్రదేశాలను గుర్తించి అక్కడ ప్రమాదాలు జరగకుండా కుంభాకార దర్పణాలు, ఇంకా సైన్ బోర్డ్స్, బారికేడ్స్ ఏర్పాటు చేయాలన్నారు. ఆక్సిడెంట్ కు సంబంధించిన ఎఫ్ఏఆర్, ఐఏఆర్ అండ్ డిఏఆర్ రిపోర్ట్స్ ను నిర్ణిత కాలవ్యవధిలో ఎంఏసిటి కోర్ట్ కు పంపించాలి. స్మార్ట్ పోలీసింగ్ సాంకేతికత అప్లికేషన్లో భాగంగా సెంట్రల్ క్రైమ్ ట్రాకింగ్ నెట్‌వర్క్ సిస్టమ్, సీసీటీవీ నిఘా, డ్రోన్ సర్వైలెన్స్, ఇతర డిజిటల్ ప్లాట్‌ఫారమ్‌లను సమర్థవంతంగా వినియోగించి నేరాలను ముందుగానే గుర్తించి, ప్రజలకు వేగవంతమైన, పారదర్శక సేవలు అందించవచ్చని తెలిపారు. మట్కా, క్రికెట్ బెట్టింగ్, జూదం తదితర అసాంఘిక కార్యకలాపాలపై ఉక్కుపాదం మోపాలన్నారు. బహిరంగ ప్రదేశాలలో మద్యం తాగే గుర్తించి వాటిని క్లీన్ చేయించాలని, ఓపెన్ డ్రింకింగ్‌పై ప్రత్యేక డ్రైవ్‌లు నిర్వహించి, సంబంధిత నేరాలను నియంత్రించాలి. డ్రోన్ సర్వైలెన్స్ విస్తృతంగా నిర్వహించాలి. ముఖ్య ప్రాంతాల్లో సీసీటీవీ కెమెరాల ఏర్పాటు కోసం ప్రజల్లో అవగాహన కల్పించాలి. బక్రీద్ పండుగ వేడుకలు, కార్యక్రమాల సమయంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అన్ని ముందస్తు భద్రత చర్యలు చేపట్టాలని అధికారులను జిల్లా ఎస్పీ ఆదేశించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో ఒంగోలు డిఎస్పీ రాయపాటి. శ్రీనివాసరావు, దర్శి బాలమురళి కృష్ణ, మార్కాపురం డిఎస్పీ యు.నాగరాజు, మహిళా పోలీస్ స్టేషన్ డిఎస్పీ పి.శ్రీధర్, ఎస్బి ఇన్స్పెక్టర్ శ్రీనివాసరావు, డిసిఆర్బి ఇన్స్పెక్టర్ దేవప్రభాకర్, సిసిఎస్ ఇన్స్పెక్టర్ భీమా నాయక్, ఐటి కోర్ ఇన్స్పెక్టర్ జగదీష్, సీఐలు,ఎస్సైలు, టెక్నికల్ సిబ్బంది పాల్గొన్నారు.

# భైరవకోనలో దద్దాల ప్రత్యేక పూజలు





**సి ఎస్ పురం, పెన్ పవర్ మే 25**

మండలంలో ప్రసిద్ధిగాంచిన ప్రముఖ పర్యాటక శైవక్షేత్రమైన భైరవకోనలో సోమవారం కనిగిరి నియోజకవర్గం వైఎస్సార్‌సీపీ ఇంచార్జి దద్దాల నారాయణ యాదవ్ ప్రత్యేక పూజలు చేశారు ముందుగా జలపాతంను సందర్శించి శ్రీ త్రిముఖ దుర్గాదేవి అమ్మవారు,భర్గేశ్వర స్వామి, నాగరేశ్వర స్వామి,కాలభైరవేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేసిన అనంతరం ఆలయ ప్రాంగణంలోని శివలింగాలను దర్శించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు వేద మంత్రోచ్చారణతో ఆశీర్వదించి, స్వామి వారి తీర్థప్రసాదాలు అందజేసి పూలదండ,స్వామి వారి శేషవస్త్రంతో ఘనంగా సన్మానించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీ త్రిముఖ దుర్గాభర్గులేశ్వర స్వామి ఆశీస్సులతో నియోజకవర్గం లోని ప్రజలు సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో, అష్ట ఐశ్వర్యాలతో, పాడిపంటలతో సుభిక్షంగా ఉండాలని మనస్ఫూర్తిగా కోరుకున్నట్లు తెలిపారు ఈ కార్యక్రమంలో వైఎస్సార్సీపీ కనిగిరి నియోజకవర్గం యువజన విభాగం అధ్యక్షులు వాకమల్ల రాజశేఖర్ రెడ్డి, మాజీ సర్పంచ్ గోబ్బిల్ల శ్రీనివాసులు యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# మనబడి - జ్ఞానబాట కార్యక్రమం విజయవంతం

## అడ్మిషన్ పెంపుకు

## అడవిరాజుపాలెంలో అవగాహన ప్రచారం





**గుడ్లూరు, పెన్ పవర్, మే 25:**

జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల అడవిరాజుపాలెం గ్రామంలో "మన బడి -- జ్ఞాన బాట" కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు మరియు గ్రామ ప్రజలు కలిసి గ్రామంలోని ప్రతి ఇంటికి వెళ్లి, తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మండల విద్యాశాఖ అధికారులు బి.హరే రామ్ పాల్గొని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు ప్రభుత్వం అందిస్తున్న సౌకర్యాలను వివరించారు. విద్యార్థులకు ఉచిత పాఠ్యపుస్తకాలు, మూడు జతల యూనిఫారాలు, స్కూల్ బ్యాగ్, బెల్ట్, షూస్, "తల్లికి వందనం" పథకం ద్వారా రూ.15,000 ఆర్థిక సహాయం, పోషకాహారంతో కూడిన మధ్యాహ్న భోజనం వంటి అనేక ప్రయోజనాలు అందుతున్నాయని వారు తెలిపారు. ప్రతి తల్లితండ్రి తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించి, నాణ్యమైన విద్యను అందించాలని సూచించారు. ఈ కాంపెయిన్ ఫలితంగా అడవిరాజుపాలెం గ్రామం నుండి 5౦ వయస్సు గల 4 మంది విద్యార్థులు, అడవిరాజుపాలెం ఏఏపీ నుండి 3 మంది, అమ్మవారిపాలెం నుండి 3 మంది, ఆర్‌సి అగ్రహారం నుండి ఒక విద్యార్థి, ఇతర ప్రైవేట్ పాఠశాలల్లో చదువుతున్న 7 మంది విద్యార్థులు కలిపి మొత్తం 18 మంది విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలలో అడ్మిషన్ పొందడం విశేషం. గ్రామస్థులు ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి ఉపాధ్యాయులు చేస్తున్న కృషిని అభినందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు జి.రాజా, ఉపాధ్యాయులు పిగిలి మనోహరం, చుండూరి వసంత, గొర్ల కొండయ్య, కె.శ్రీనివాసులు, రాచూరి రమణారావు, పొంకం మాల్యాద్రి, పొట్లూరి ఎన్.మునుస్వామి, సుందరరాజు, పి. శాంతకుమారి (అంగన్వాడీ కార్యకర్త), జి.వెంగళరావు(సీ.ఆర్.ఎం.టీ) తదితరులు పాల్గొన్నారు.

# కాలుజారి బావిలో పడ్డ వ్యక్తి

## రక్షించి ఆసుపత్రికి తరలించిన కొమరోలు పోలీసులు

**కొమరోలు పెన్ పవర్ మే 25**

పొరపాటున కాలుజారి బావిలో పడ్డ కాశీం అనే వ్యక్తిని కొమరోలు పోలీసులు రక్షించిన సంఘటన సోమవారం కొమరోలు మండలం ఇడమకల్లు క్రాస్ రోడ్డు వద్ద జరిగింది. కొమరోలు పోలీసులు అందించిన సమాచారం మేరకు కొమరోలు లోని మదరస సమీపంలో నివాసం ఉంటున్న షేక్ ఖాసిం సోమవారం ఉదయం కొమరోలు నుంచి ఎడమ కలుగు కు వెళ్తూ మార్గమధ్యంలో ఎడమకలు క్రాస్ రోడ్ సమీపంలో గల దిగుడు బావి వద్ద ఆగి మూత్ర విసర్జన చేస్తుండగా మద్యం మత్తులో ఉన్న అతడు పొరపాటున కాలుజారి లోతైన బావిలో పడ్డాడు. బావిలో నీరు లేకపోవడంతో పాటు బావి గట్టు పైన చెట్టు ఉండటంతో చల్లని చెట్టు నీడన మద్యం మత్తులోఉన్న ఖాసిం బావిలోనే పడుకుని నిద్రపోయాడు. మెలుకువ రావటంతో అతడు బయటికి వచ్చే ప్రయత్నం చేశారు. అయితే వీలుపడకపోవడంతో అతడు వేసిన కేకలను ఆ దారిన వెళ్లేవారు గమనించి కొమరోలు పోలీసులకు సమాచారం అందించారు. ఆ మేరకు కొమరోలు పోలీసులు బావి వద్దకు చేరుకుని బావిలో జారిపడ్డ ఖాసింను సురక్షితంగా బయటకు తీశారు . స్వల్ప గాయాలతో ఉన్న అతనిని 108 వాహనంలో గిద్దలూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. బావిలో జారిపడ్డ ఖాసింను రక్షించి సురక్షితంగా బయటకు తెచ్చిన పోలీసులకు ఖాసిం కుటుంబ సభ్యులు ధన్యవాదాలు తెలిపారు. బావిలో నీరు లేకపోవడంతో పాటు, చెట్టు నీడ ఉండటంతో ఖాసిం ప్రాణాపాయం నుంచి తప్పించుకొని క్షేమంగా బయటపడగలిగాడని కుటుంబ సభ్యులు తెలిపారు.



# అల్లినగరం గ్రామంలో ఎం ఎస్ ఎం ఈ పార్కుకు శంకుస్థాపన

## విజువల్ గా ప్రారంభించిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు



**కొమరోలు పెన్ పవర్ మే 25**

కొమరోలు మండలం అల్లినగరం గ్రామంలో ఎం ఎస్ ఎం ఈ పార్కు ఏర్పాటుకు సోమవారం తెలుగుదేశం పార్టీ నాయకులు భూమి పూజ చేశారు. దాదాపు 100 ఎకరాలలో ఏర్పాటుచేసే ఎం ఎస్ ఎం ఈ పార్కు ద్వారా నిరుద్యోగులకు ఉపాధి కల్పించే అవకాశాలు ఉన్నాయి. గిద్దలూరు శాసనసభ్యులు ముత్తుముల అశోక రెడ్డి చొరవతో రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఎం ఎస్ ఎం ఈ పార్కు మంజూరు చేశారు. ఆ మేరకు సోమవారం ముఖ్యమంత్రి విజువల్ ద్వారా ప్రారంభించారు. కాగా సోమవారం గిద్దలూరు మార్కెట్ యార్డ్ చైర్మన్ బైలడుగు బాలయ్య ,వైస్ చైర్మన్ గోడి ఓబుల్ రెడ్డి, డైరెక్టర్లు షేక్ హసీనా, బిజ్జాల తిరుమల రెడ్డి, గజ్జలకొండ నారాయణ ,కొమరోలు మండల తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు, కొమరోలు సహకార సంఘం అధ్యక్షులు ముత్తుముల సంజీవరెడ్డి , ఎడమ కళ్ళు సహకార సంఘం అధ్యక్షులు బిజ్జం రవీంద్రారెడ్డి,మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు బోనేని వెంకటేశ్వర్లు యాదవ్, మండల తెలుగుదేశం పార్టీ నాయకులు వీరం రెడ్డి శంకర్ రెడ్డి, తదితర నేతలు పాల్గొని శిలాఫలకానికి ప్రారంభోత్సవం చేశారు. ఆ సందర్భంగా సంజీవరెడ్డి మాట్లాడుతూ ,నిరుద్యోగ యువతకు ఉపాధి సౌకర్యాలు కల్పించే ఉద్దేశంతో గిద్దలూరు శాసనసభ్యులు ముత్తుముల అశోక్ రెడ్డి అల్లినగరంలో 100 ఎకరాలలో ఎం ఎస్ ఎం ఈ పార్కు ఏర్పాటుకు చర్యలు తీసుకున్నారని ,ఆ మేరకు రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తో పార్కు మంజూరు చేయించారని ఆయన తెలిపారు. పార్కు ఏర్పాటు ద్వారా అన్ని రకాల పరిశ్రమలు ఏర్పాటు చేసేందుకు ప్రోత్సాహం లభిస్తుందని తద్వారా నిరుద్యోగులకు ఉపాధి సౌకర్యాలు ఏర్పడగలవని ఆయన పేర్కొన్నారు. అల్లినగరం గ్రామంలో ఎం ఎస్ ఎం ఈ పార్కు మంజూరు చేసిన రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు, పార్కు ఏర్పాటుకు కృషి చేసిన గిద్దలూరు శాసనసభ్యులు ముత్తుముల అశోక్ రెడ్డికి కొమరోలు మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు బోనేని వెంకటేశ్వర్లు యాదవ్ ధన్యవాదాలు తెలిపారు.ఆ కార్యక్రమంలో అల్లినగరం పంచాయతీలోని తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



# నేడు చింతలపల్లి, వర్ధన పల్లి గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిపివేత



**కొమరోలు పెన్ పవర్ మే 25**

కొమరోలు మండలం కసినేపల్లె సబ్ స్టేషన్ పరిధిలోని చింతలపల్లి, వర్ధన పల్లి గ్రామాలకు ఈనెల 25వ తేదీ మంగళవారం ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపి వేయనున్నట్లుగా కొమరోలు విద్యుత్ శాఖ ఏఈ ఎం శ్రీనివాసులు తెలిపారు. మండలంలో అమలు జరుగుతున్న ఆర్ డి ఎస్ ఎస్ పథకం ద్వారా కొత్త లైన్ల ఏర్పాట్లలో భాగంగా ఈనెల 25వ తేదీ చింతలపల్లి, వర్ధన పల్లి గ్రామాలలో కొత్త లైన్లు ఏర్పాటుకు చర్యలు తీసుకున్నామని ఆయన తెలిపారు. ఆ కారణంగా సదరు రెండు గ్రామాలకు మంగళవారం ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లుగా ఆయన చెప్పారు కావున దయచేసి వినియోగదారులు విద్యుత్ శాఖ సిబ్బందికి సహకరించాలని కోరారు.

# బక్రీదు సందర్భంగా ముస్లిం మత పెద్దలతో పోలీసుల సమావేశం



**కందుకూరు పెన్ పవర్, మే 25**

రాబోవు బక్రీదు పండగ సందర్భంగా కందుకూరు పట్టణ పరిధిలోని ముస్లిం మత పెద్దలతో కందుకూరు డిఎస్పీ సిహెచ్ వి బాలసుబ్రమణ్యం సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా డిఎస్పి మాట్లాడుతూ బక్రీద్ పండగ సందర్భంగా అందరూ మతసామరస్యాన్ని పాటించాలని,ఇతర మతాల మనోభావాలను గౌరవిస్తూ శాంతి వాతావరణం లో పండగ జరుపుకోవాలని, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చూసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో కందుకూరు సిఐ షేక్ అన్వర్ బాషా , కందుకూరు పట్టణ ఎస్ఐ పులి శివ నాగరాజు పాల్గొన్నారు.

# 29న శ్రీ హర్షిణి డిగ్రీ కళాశాలలో జాబ్ మేళా

### శ్రీ హర్షిణి డిగ్రీ కళాశాల చైర్మన్ గోరంట్ల రవి కుమార్



కల్చరల్ రిపోర్టర్, పెన్ పవర్ ఒంగోలు మే 25

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ వారి ఆధ్వర్యంలో ఈనెల 29 న శ్రీ హర్షిణి డిగ్రీ కళాశాల, ఒంగోలు నందు జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు శ్రీ హర్షిణి డిగ్రీ కళాశాల చైర్మన్ గోరంట్ల రవి కుమార్, డీన్ డి.ఆంజనేయులు, కళాశాల ప్రిన్సిపాల్ ఎం నాగేంద్రం ఒక సంయుక్త ప్రకటనలో తెలియచేశారు. ఈ జాబ్ మేళాకు, ఇండోసోల్, యాక్సిస్ బ్యాంకు, చోళ గోల్డ్, హెటిరో ల్యాబ్స్, అపోలో ఫార్మా, ముత్తూట్ ఫైనాన్స్,టాటా ఎలక్ట్రానిక్స్, డాక్టస్ బిజినెస్ సొల్యూషన్స్ కంపెనీల ప్రతినిధులు హాజరవుతున్నారని 300 కి పైగా ఖాళీలు ఉన్నాయని తెలియచేశారు. జీతం వారి విద్యార్హతను బట్టి సుమారు 12,000-20,000 రూపాయల వరకు ఉంటుందని తెలిపారు. ఈ జాబ్ మేళా కు ఎస్.ఎస్.సి, ఇంటర్, ఐ టి ఐ , డిగ్రీ, డిప్లొమా, బి.టెక్, ఎం.బి.ఎ, పి.జి విభాగముల వరకు చదువుకున్న, 18-30 సం.ల వయసు గల నిరుద్యోగ యువతీ యువకులు వారి యొక్క బయోడేటా లేదా రెస్యూమ్, ఎడ్యుకేషన్ సర్టిఫికేట్స్ జిరాక్స్, ఆధార్ నకలు, పాస్ పోర్ట్ ఫోటో తో నేరుగా ఇంటర్వ్యూ కు హాజరు కావాల్సి ఉంటుందని తెలిపారు. ఇతర వివరాలకు 79-89244381, 91 91607 97311 ఈ నెంబర్లను సంప్రదించాలని తెలిపారు. అభ్యర్థులు వెబ్ పోర్టల్ నందు రిజిస్టర్ చేసుకోవాలని తెలిపారు. మరిన్ని వివరములకు టోల్ ఫ్రీ నంబర్: 9988853335 పైన తెలిపిన నంబర్లను సంప్రదించవలసినదిగా కోరారు.

# కాశీనాయన ఆశ్రమాన్ని ఆధ్యాత్మిక కేంద్రంగా అభివృద్ధి చేసుకుందాం.

### పిలుపునిచ్చిన కొమరోలు మండల తెలుగుదేశం పార్టీ నాయకులు ముత్తుముల ఎల్లారెడ్డి




కొమరోలు పెన్ పవర్ మే 25

గిద్దలూరు లోని కాశీనాయన ఆశ్రమాన్ని ఆధ్యాత్మిక కేంద్రంగా అభివృద్ధి చేసుకొనుటకు అందరూ సహకరించాలని కొమరోలు మండలం తెలుగుదేశం పార్టీ కో కన్వీనర్ ముత్తుముల ఎల్లారెడ్డి పిలుపునిచ్చారు. కాశీనాయన ఆశ్రమంలో ప్రతి సోమవారం అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నారు. ఆ సందర్భంగా ఆ కార్యక్రమంలో పాల్గొన్న ఎల్లారెడ్డి మాట్లాడుతూ, నిరుపేదలకు, కొడుకు కోడళ్ళు ఆధారంగా లేని అవ్వదాతలకు, బాటసారులకు ప్రతి సోమవారం అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లుగా ఆయన తెలిపారు. అందువల్ల ఎంతో పవిత్రంగా, సామాజికంగా ఆధ్యాత్మికంగా సేవలు అందిస్తున్న కాశీనాయన ఆశ్రమాన్ని దాతల సహకారంతో అతిపెద్ద ఆధ్యాత్మిక కేంద్రంగా ఏర్పాటు చేసుకొని రాబోవు తరాలకు కేంద్ర బిందువుగా ఏర్పాటు చేసుకోవాల్సిన అవసరం అందరి పైన ఉన్నదని ఆయన తెలిపారు. గొప్ప కార్యక్రమాలు నిర్వహిస్తున్న కాశీనాయన ఆశ్రమం గిద్దలూరు నియోజకవర్గంలో ఉండటం అందరి అదృష్టమని అన్నారు.కావున దాతలు తన వంతుగా సహాయ సహకారాలు అందించి కాసినాయన ఆశ్రమాన్ని ఆధ్యాత్మిక కేంద్రంగా అభివృద్ధి చేసుకునేందుకు సహకరించాలని ఎల్లారెడ్డి కోరారు.

# తెలుగుదేశం కార్యకర్తల పండుగ మహానాడు

### జిల్లా టిడిపి మైనారిటీ నేత షేక్ రసూల్

పొదిలి, పెన్ పవర్, మే 25



తెలుగుదేశం పార్టీ ప్రతి ఏటా నిర్వహిస్తున్న మహానాడును జిల్లా తెలుగుదేశం పార్టీ మైనారిటీ విభాగపు అధ్యక్షులు షేక్. రసూల్ మహమ్మద్ ఒక పండుగలా అభివర్ణించారు. రాష్ట్రంలో అన్ని వర్గాల సంక్షేమం కోసం కృషి చేస్తున్న తెలుగుదేశం పార్టీ ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. తెలుగు దేశం పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు నందమూరి తారక రామారావు జయంతి సందర్భంగా తెలుగుదేశం పార్టీ మహానాడు ను నిర్వహించడం ఎంతో సంతోషదాయకమన్నారు. అలాగే పొదిలి లో కూడా నిర్వహించబోతున్న మహానాడు కార్యక్రమానికి తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు, అభిమానులు అధిక సంఖ్యలో తరలిరావాలని రసూల్ పిలుపునిచ్చారు. గతంలో కాకుండా ఈసారి నియోజకవర్గాల స్థాయిలోనే తెలుగుదేశం పార్టీ మహానాడు ను నిర్వహించే విధంగా ఆదేశాలు ఇవ్వడం జరిగిందని, అందువల్ల తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు, అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాలను పూర్తిస్థాయిలో విజయవంతం చేయాలని రసూల్ కోరారు.

# ఎమ్మెస్ఎంఈ పార్కుకు శంకుస్థాపన

### -వర్చువల్ గా ప్రారంభించిన ముఖ్యమంత్రి చంద్రబాబు
### -శిలాఫలకాన్ని ఆవిష్కరించిన ఇంటూరి
### -భవిష్యత్తులో ఈ ప్రాంతం పారిశ్రామిక నగరంగా మారడం ఖాయం - ఎమ్మెల్యే







కందుకూరు పెన్ పవర్, మే 25:

కందుకూరు నియోజకవర్గాన్ని పారిశ్రామిక కేంద్రంగా తీర్చిదిద్దడంలో భాగంగా, వలేటివారిపాలెం మండలం అయ్యవారిపల్లె దగ్గర సుమారు 100 ఎకరాలలో ఏర్పాటు కాబోతున్న ఎమ్మెస్ ఎం ఇ పార్కుకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సోమవారం వర్చువల్ విధానంలో శంకుస్థాపన చేశారు.

స్థానిక ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు ముఖ్యఅతిథిగా పాల్గొని శిలాఫలకాన్ని ఆవిష్కరించగా సబ్ కలెక్టర్ దామెర హిమవంశీ, పలువురు అధికారులు హాజరయ్యారు. ఈ కార్యక్రమాన్ని స్వాగతిస్తూ, వలేటివారిపాలెం మండల వ్యాప్తంగా భారీ సంఖ్యలో ప్రజలు తరలివచ్చి వేడుకలో పాలుపంచుకున్నారు.

తొలి విడతగా 20 ఎకరాల్లో 9 కోట్ల రూపాయలతో రోడ్లు, కాలువలు, డ్రైనేజీ, విద్యుత్, తాగునీరు వంటి మౌలిక వసతులు ఏర్పాటు చేయనున్నారు. ఎమ్మెల్యే నాగేశ్వరరావు మాట్లాడుతూ రాష్ట్ర ఆదాయాన్ని పెంచడమే కాకుండా, యువతకు ఉపాధి ఉద్యోగాలు కల్పించాలన్న లక్ష్యంతో పరిశ్రమలు నెలకొల్పేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు కృషి చేస్తున్నారని అన్నారు. అందులో భాగంగా రామాయపట్నం పోర్టు, బిపిసిఎల్, ఇండోసోల్ కంపెనీలు ఇప్పటికే ఏర్పాటు కాగా, కొత్తగా ఎమ్మెస్ ఎం ఈ పార్కు రావడం ఈ ప్రాంత ప్రజల అదృష్టంగా భావిస్తున్నట్లు చెప్పారు. తన సొంత మండలానికి త్వరలో అనేక పరిశ్రమలు రాబోతున్నాయన్న సంతోషం కంటే.... వేల మందికి ఉపాధి దొరుకుతుందన్న ఆనందమే ఎక్కువగా ఉందన్నారు.

వలేటివారిపాలెం చుట్టుపక్కల గ్రామాల నుంచి వలసలు ఎక్కువగా ఉంటాయని, పరిశ్రమలు వస్తే వారందరికీ ఇక్కడే ఉపాధి దొరుకుతుందని ఎమ్మెల్యే నాగేశ్వరరావు అన్నారు. నియోజవర్గానికి చెందిన వారు ఎవరైనా, ఇక్కడ పరిశ్రమలు స్థాపించడానికి ముందుకు వస్తే, వారికి ప్రాధాన్యత ఉంటుందని ఎమ్మెల్యే చెప్పారు. రాబోయే రోజుల్లో అయ్యవారిపల్లె ప్రాంతం పారిశ్రామిక నగరంగా మారడం ఖాయమన్నారు. నీటి వసతి కోసం రాళ్లపాడు రిజర్వాయర్, పక్కనే జాతీయ రహదారి ఉండటం కూడా కలిసి వచ్చే అంశాలుగా పేర్కొన్నారు. కందుకూరు నియోజకవర్గానికి ఇంత మంచి అవకాశం కల్పించిన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, నారా లోకేష్ కి ఎమ్మెల్యే నాగేశ్వరరావు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ ప్రాంత అభివృద్ధికి అనేక ప్రతిపాదనలతో వారిద్దరి దగ్గరికి ఎన్నోసార్లు వెళ్లి వివరించడం జరిగిందన్నారు. వారి సహకారం వలనే పార్కుకు శంకుస్థాపన చేయగలిగామన్నారు. ఈ ప్రాంత ప్రజలు కూటమి ప్రభుత్వానికి రుణపడి ఉంటారని అన్నారు. సబ్ కలెక్టర్ హిమవంశీ మాట్లాడుతూ స్టార్టప్ కంపెనీలు ఏర్పాటు చేయాలనుకునే వారికి ఈ పార్క్ చక్కని అవకాశమని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 35 పైగా ఇలాంటి పార్కులకు ముఖ్యమంత్రి వర్చువల్ గా శంకుస్థాపన చేశారన్నారు. ఈ పార్కు ద్వారా వచ్చే అవకాశాలను నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో ఏపీఐఐసి డిఈ స్వర్ణలత, ఎంపీడీవో శంకర్రావు, వలేటివారిపాలెం మండల టిడిపి అధ్యక్షులు మాదాల లక్ష్మీనరసింహం, కంద్రా మాల్యాద్రి, గ్రామ పార్టీ అధ్యక్షుడు మంచాల మల్లికార్జున పార్టీ నాయకులు వేమూరి రాజా, కూడలి భాస్కర్, ఎల్లంపల్లి భరత్, ఆవుల నరేష్ కామినేని రఘు, చెరువుపల్లి మాల్యాద్రి కామినేని అశోక్, కామినేని వీరయ్య, ప్రగడ శీను, కాకుమాని హర్ష, మార్తాల సుబ్బారెడ్డి, చొప్పర బ్రహ్మయ్య, మానికొండ కొండయ్య, వలేటి మధు, పసుపులేటి సుధాకర్, కర్ణ కృష్ణారెడ్డి, ప్రగడ మోహన్ అనుబంధ సంఘాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఏపీఈజేయూ జిల్లా నూతన కార్యవర్గం ఎన్నిక

### - అధ్యక్ష కార్యదర్శులుగా ఏ. సుబ్బారావు, జి. మల్లికార్జున్ రెడ్డి







క్రైమ్ రిపోర్టర్ పెన్ పవర్, ఒంగోలు మే 25

ఆంధ్ర ప్రదేశ్ ఎడిటర్స్ అండ్ జర్నలిస్ట్ యూనియన్ ప్రకాశం జిల్లా శాఖ నూతన కార్యవర్గాన్ని సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు రాష్ట్ర అధ్యక్షులు మేకపాటి మాల్యాద్రి ఒక ప్రకటనలో తెలియజేశారు. ప్రకాశం జిల్లా నూతన కమిటీ అధ్యక్షులు గా ఏ. సుబ్బారావు, ఉపాధ్యక్షులుగా టీ. శైలజ, ప్రధాన కార్యదర్శిగా జి. మల్లికార్జున్ రెడ్డి, కార్యదర్శిగా ఇర్ల శ్రీనివాసరావు, కోశాధికారిగా బి.సంజీవరావు తో పాటు 20 మందిని కార్యవర్గ సభ్యులు గా ఎన్నుకున్నారు. ఈ కార్యవర్గం రెండు సంవత్సరాల పాటు కొనసాగుతుందని మాల్యాద్రి తెలిపారు. నూతన కార్యవర్గం జర్నలిస్టుల సమస్యల తో పాటు జర్నలిస్టుల హక్కుల కోసం నిరంతరం పోరాడుతుందని తెలిపారు. మానవసేవే మాధవసేవ అన్న సూక్తిని ఆచరిస్తూ ఇప్పటికే ఎన్నో సేవా కార్యక్రమాలు సంఘం ద్వారా నిర్వహించడం జరిగిందని, నూతన కార్యవర్గం కూడా సామాజిక సేవా కార్యక్రమాల్లో భాగస్వామ్యం అవుతుందని మేకపాటి మాల్యాద్రి తెలియజేశారు.

# ఉదయగిరి ఎమ్మెల్యే సురేష్‌ను కలసిన దేశం నాయకులు



పొదిలి, పెన్ పవర్, మే 25

ఉదయగిరి నియోజకవర్గ శాసనసభ్యులు కాకర్ల సురేష్ ను మండల తెలుగుదేశం నాయకులు కలుసుకున్నారు. సోమవారం నాడు ఉదయగిరి పట్టణంలో ఎమ్మెల్యే సురేష్ ను దేశం నాయకులు మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర తెలుగుదేశం పార్టీ కార్యదర్శి మీగడ ఓబుల్ రెడ్డి, మైనారిటీ విభాగపు నాయకులు షేక్ మౌలాలి, ముల్లా రబ్బాని, ముల్లా గౌస్ తదితరులు పాల్గొన్నారు.

# కేసును విచారించకుండా.. జగన్ పై విమర్శలు తగదు

### వైసీపీ నేత సయ్యద్ గౌస్ మోహిద్దీన్

మార్కాపురం పెన్ పవర్ మే25

వైయస్ వివేకానంద రెడ్డి హత్య కేసు విచారించే అధికారం కూటమి సర్కార్కు ఉన్న ఆ పని చేయకుండా కేవలం జగన్ పై గోడ్డలివేటు అన్న విమర్శలు చేయడం హాస్యాస్పదంగా ఉందని వైసీపీ మైనార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి సయ్యద్ గౌస్ మోహిద్దీన్ విమర్శించారు. ఆ కేసును విచారించే అధికారం కూటమి సర్కార్ కు ఉన్న కేవలం జగన్ను విమర్శించి ఇరకాటంలో నెట్టాలన్న ఉద్దేశంతోనే కేసు ముందుకు సాగకుండా అడ్డుకుంటున్నారని విమర్శించారు. కేసు విచారణ పూర్తయితే జగన్ పై వస్తున్న ఆరోపణలు నిజం లేదని తేలిపోతుందని అందుకే కూటమి సర్కార్ ఈ తరహా ధోరణిని అవలంబిస్తోందని ఆయన పేర్కొన్నారు. గొడ్డలి వేటు అన్న విమర్శలు మాని కూటమి సర్కార్ కు దమ్ముంటే కేసును పూర్తిస్థాయిలో విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. ప్రజలు ఎంతో విజ్ఞులని ఈ విమర్శలు పట్టించుకోరని కూటమినేతలకు సూచించారు. ప్రజలకు కావాల్సిన సంక్షేమ పథకాలు అందించకుండా వాటి నుంచి తప్పించుకునేందుకు జగన్ పై విమర్శలు చేస్తున్నారని ఆయన అన్నారు. ఈ తరహా విమర్శలను వైసిపి నేతలంతా ఐక్యంగా అడ్డుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. పార్టీ కోసం జగన్ కోసం కష్టపడి పనిచేస్తున్న నేతల పత్రికా ప్రకటనలను కూడా పార్టీలోనే కొందరు మహానుభావులు అడ్డుకునే ప్రయత్నం చేస్తున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. వారు కూడా ఈ రకమైన ధోరణి మార్చుకొని పార్టీ కోసం అందర్నీ ఐక్యంగా ముందుకు తీసుకెళ్లాలని కోరారు.




# పొగాకు రైతులను ఆదుకోవాలని సంయుక్త కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం







కందుకూరు పెన్ పవర్, మే 25

ఎస్ టి సి కి నిధులు కేటాయించి, మార్కెట్ లో పోటీతత్వాన్ని పెంచి, రైతులకు గిట్టుబాటు ధర కల్పించి, పొగాకు రైతులను ఆదుకోవాలని కందుకూరు లోని పామూరు రోడ్ లో గల 27 వ పోగాకు వేలం కేంద్రం వద్ద సంయుక్త కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో సోమవారం ఉదయం 10 గంటల నుండి 11:30 వరకు పొగాకు రైతులు నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ నిరసన కార్యక్రమానికి సిఐటియు జిల్లా నాయకులు జీవీబీ కుమార్ అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమంలో సంయుక్త కిసాన్ మోర్చా నాయకులు మాదాల రమణయ్య, కే వీరారెడ్డి మాట్లాడారు, పొగాకు రైతుల ఆందోళనకు మద్దతుగా సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ముప్పా రమేష్, ఏఐటీయుసీ జిల్లా నాయకులు బూసి.సురేష్, రైతు నాయకులు నేతి మహేశ్వర రావు మాట్లాడారు. నాయకులు మాట్లాడుతూ విదేశీ మారకద్రవ్యాలు, ఎక్సైజ్ సుంకాల రూపంలో కేంద్ర ప్రభుత్వానికి విపరీతంగా ఆదాయాలు వస్తున్నాయని పేర్కొన్నారు. పొగాకు కంపెనీలు వేల కోట్ల రూపాయలు లాభాలను అర్జిస్తున్నారని చెప్పారు. కానీ పొగాకు రైతులు మాత్రం నష్టాల్లో ఉన్నారని ఆందోళన వ్యక్తం చేశారు .వీరిని ఆదుకునేందుకు ప్రభుత్వాలు ముందుకు రాకపోవడం సిగ్గుచేటని విమర్శించారు. ఈ సంవత్సరం 28 వేలతో పొగాకు వేలం ప్రారంభించి, రోజురోజుకు ధరలు పతనవుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. రైతులు పొగాకు బోర్డు కు తెచ్చిన బెళ్ళలో 50 నుండి 70 శాతం వరకు నోబిడ్స్ పెట్టి తిరస్కరించడం ద్వారా రైతులు తీవ్రమైన ఇబ్బందులకు గురవుతున్నారని పేర్కొన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, పొగాకు రైతుల సమాఖ్య, ఎస్ టి సి ద్వారా 500 కోట్లు నిధులు కేటాయించి, పోగాకు కొనుగోళ్లు మొదలు పెట్టాలని కోరారు. నో బిడ్స్ లేకుండా పూర్తిగా పొగాకు కొనుగోళ్లు చేయాలని, క్వింటాల్ కి 30 వేలుకి కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. ఇలా కానట్లయితే ఈపాటికే గత రెండేళ్లుగా పొగాకు రైతులకు ఖర్చులు పెరిగి, నష్టాలు వచ్చి, రైతులను ఆదుకునే వాళ్ళు లేక, రైతులు ఆత్మహత్యలు చేసుకోవాల్సిన దుస్థితి ఏర్పడుతుందన్నారు. ఇలాంటి పరిస్థితికి వెళ్లకుండా రైతులను ఆదుకోవాలని సంయుక్త కిసాన్ మోర్చా నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కందుకూరు, వలేటివారిపాలెం,లింగసముద్రం మండల రైతులు తోకల సుబ్బారావు, వరికూటి సంజీవరెడ్డి, తాటికొండ రమణయ్య,ఉట్లపల్లి వెంకటేశ్వర్లు, అనుమోలు రత్తయ్య, మాదాల మాధవ, మామిళ్ళపల్లి మహేష్, నాయుడు, వలేటి సుధాకర్, బోరెడ్డి రమణయ్య, మహేంద్ర, చెన్నకేశవులు, దువ్వూరి జాన్, ఆనంద్, సుభాను తదితరులు పాల్గొన్నారు.

# రైతులకు నాణ్యమైన ఎరువులే అందించాలి -వ్యవసాయ అధికారి ప్రకాష్ రావు





**కొనకనమిట్ల పెన్ పవర్ మే 25**

కొనకనమిట్ల మండలంలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ఎరువులు,పురుగు మందుల దుకాణాలపై సోమవారం విస్తృత తనిఖీలు నిర్వహించినట్లు మండల వ్యవసాయ అధికారి కె. ప్రకాష్‌రావు తెలిపారు.రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలు మరియు ఉన్నతాధికారుల సూచనల మేరకు రైతుల ఆరోగ్య భద్రత దృష్ట్యా "పారా క్వాట్ డైక్లోరైడ్ 24 శాతం ఎస్ఎల్" కలుపు మందు అమ్మకాలు,పంపిణీ మరియు వినియోగంపై 60 రోజుల పాటు తాత్కాలిక నిలుపుదల విధించినట్లు వెల్లడించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మనుషుల ఆరోగ్యానికి తీవ్ర హానికరంగా మారుతున్నట్లు గుర్తించిన నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు చెప్పారు.ప్రభుత్వ ఉన్నతాధికారులు పూర్తిస్థాయి విచారణ అనంతరం తుది నిర్ణయం ప్రకటించే వరకు ఎవరూ ఈ కలుపు మందును విక్రయించరాదని స్పష్టం చేశారు.తనిఖీల్లో భాగంగా పెదారికట్ల గ్రామంలోని భాగ్యలక్ష్మి ఫర్టిలైజర్ దుకాణంలో సుమారు 30 లీటర్ల పారా క్వాట్ డైక్లోరైడ్ నిల్వ ఉన్నట్లు గుర్తించిన అధికారులు వాటిని విక్రయించకుండా 60 రోజుల పాటు నిల్వ ఉంచాలని షాపు యజమానికి నోటీసులు జారీ చేశారు.అనంతరం మండలంలోని ఎరువుల వ్యాపారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించి రసాయనిక ఎరువులు మరియు పురుగుమందులను సంచులపై ముద్రించిన గరిష్ట ధర (ఎమ్మార్పీ)కే విక్రయించాలని ఆదేశించారు.ఎమ్మార్పీ కంటే అధిక ధరలకు విక్రయిస్తే శాఖాపరమైన కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.డీలర్ల వద్ద ఉన్న పాత నిల్వలను పాత ఎమ్మార్పీ ధరలకే రైతులకు విక్రయించాలని పెరిగిన ధరలను వాటికి వర్తింపజేయకూడదని సూచించారు.అదేవిధంగా రైతులు విత్తనాలు,ఎరువులు,పురుగుమందులు కొనుగోలు చేసే సమయంలో తప్పనిసరిగా అధికారిక నగదు రసీదులు తీసుకోవాలని కోరారు.పంట నష్టాలు సంభవించినప్పుడు పరిహారం పొందేందుకు ఈ రసీదులే ప్రధాన ఆధారాలుగా ఉపయోగపడతాయని వివరించారు.ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ విస్తరణ అధికారి బి. విక్రం సంబంధిత శాఖ సిబ్బంది మరియు ఎరువుల వ్యాపారులు పాల్గొన్నారు.

# యర్రగొండపాలెంలో గాలి వాన భీబత్సవం

## మేడపి లో గాలికి లేచిపోయిన టోల్ గేట్ పరిశీలించిన ఎమ్మెల్యే తాటిపర్తి





**ఆర్ సి ఇంచార్జి యర్రగొండపాలెం పెన్ పవర్ మే 25**

యర్రగొండపాలెంలో సోమవారం సాయంత్రం ఆకస్మాత్తుగా కురిసిన గాలి వాన గంటపాటు భీభత్సవాన్ని సృష్టించింది. ఎన్నడు లేని విధంగా భారీగా గాలులు వీయడంతో రోడ్డుకు ఇరువైపులా చెట్లు పడిపోవడంతో పాటు, దుకాణాల ముందు రేకుల షెడ్లు ఎగిరిపోయాయి. వానతోపాటు వడగండ్లు కురవడం విశేషం. పట్టణంలో ఉదయం నుండి ఎండ తీవ్రతకు అల్లాడిన ప్రజలు ఒక్కసారిగా కురిసిన వర్షానికి సేదతీరిన తీవ్ర గాలి వాన కు భయందోళనకు గురయ్యారు. అకాల వర్షానికి మండలంలోని వివిధ గ్రామాలలోని రైతులు చెట్లు పడిపోవడంతో ఆందోళనకు గురయ్యారు.వినుకొండ రోడ్డు, కోలుకుల రోడ్డులో భారీ చెట్లు నేలకొరిగాయి. త్రిపురాంతకం మండలంలోని మేడపి టోల్ గేట్ పైకప్పు పూర్తిగా గాలికి ఎగిరి వంద కిలో మీటర్ల దూరనికి వెళ్లి పడ్డాయి. దింతో జాతీయ రహదారిపై ట్రాఫిక్కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. ఒక్కసారిగా వచ్చిన అకాల వర్షం రైతులకు ఎంతగానో నష్టం మిగిల్చింది.

# మహానాడు కార్యక్రమాన్ని పరిశీలించిన చందన స్రవంతి.



**పొన్నలూరు పెన్ పవర్ మే 25**

మే నెల 27, 28 తేదీల్లో స్థానిక టిడిపి కార్యాలయం సమీపంలో జరుగుతున్నటువంటి మహానాడు కార్యక్రమాన్ని సోమవారం మహానాడు పరిశీలకరాలు డాక్టర్ పి చంద్ర స్రవంతి పనులను పరిశీలించి మండల టిడిపి అధ్యక్షుడు అనుమోలు సాంబశివరావుని వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆమె మాట్లాడుతూ మహానాడు డిజిటైజేషన్ పద్ధతిలో నెరవేస్తున్నారు కాబట్టి మండలంలోని నాయకులు కార్యకర్తలు అభిమానులు పాల్గొని ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల టిడిపి నాయకులు మండవ ప్రసాద్, ఉన్నం శ్రీనివాసరావు, కంటు గోపికృష్ణ, పల్లపోతు రమేష్ బాబు, తానికొండ మహేంద్ర, దాసరి కృష్ణారావు, మన్నేం మల్లికార్జున, చిడిపోతు శ్రీకాంత్, పసల రమణయ్య, అనుమోలు సుధాకర్ బాబు తదితరులు పాల్గొన్నారు.

# పెద్దారవీడు మండలంలో గడ్డి మందు అమ్మకాలు నిలిపివేత



**పెద్దారవీడు, పెన్ పవర్ మే 25**

వ్యవసాయ కమిషనర్ ఆదేశాల మేరకు పెద్దారవీడు మండలంలోని పురుగుమందుల షాపులపై వ్యవసాయ అధికారులు సోమవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో భాగంగా ప్రభుత్వం నిషేధించిన 'పారాక్వాట్ డైక్లోరైడ్ 24% గడ్డి మందును రాబోయే 60 రోజుల పాటు విక్రయించరాదని డీలర్లను హెచ్చరించారు.ఈ ఆకస్మిక తనిఖీలలో నిబంధనలకు విరుద్ధంగా నిల్వ ఉంచిన గడ్డి మందును అధికారులు సీజ్ చేశారు. మండలంలోని హనుమాన్ జంక్షన్ కుంటలో శ్రీ రాఘవేంద్ర ఏజెన్సీస్ లో 180 లీటర్లు, అలాగే భవాని ట్రేడర్స్ లో 9 లీటర్ల గడ్డి మందు అమ్మకాలను తక్షణమే నిలిపివేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

**నేల తల్లికి, మానవ ఆరోగ్యానికి ముప్పు..:** ఈ సందర్భంగా మండల వ్యవసాయ అధికారి ఎన్. లక్ష్మీనారాయణ మాట్లాడుతూ... గడ్డి మందులను మితిమీరి వాడటం వల్ల నేలలో ఉండే మేలు చేసే సూక్ష్మజీవులు చనిపోతాయని, అంతేకాకుండా మనుషుల ఆరోగ్యంపై కూడా ఇవి తీవ్ర ప్రభావం చూపుతాయని ఆందోళన వ్యక్తం చేశారు. అందుకే ఈ అమ్మకాలను నిలిపివేస్తున్నట్లు ప్రకటించారు.ఎక్కడైనా ఈ నిషేధిత గడ్డి మందును విక్రయిస్తే వారిపై కచ్చితంగా కేసులు నమోదు చేస్తాం. గుర్తింపు పొందిన అధికారిక డీలర్లు ఈ తప్పుకు పాల్పడితే వారి లైసెన్సులను రద్దు చేస్తాం అని హెచ్చరించారు.

**ల్యాబ్‌కు 13 రకాల పత్తి విత్తన నమూనాలు..:** మండలంలో నకిలీ విత్తనాల అడ్డుకట్టకు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యల్లో భాగంగా, స్థానిక డీలర్ల వద్ద నుండి ఇప్పటివరకు 12 కంపెనీలకు చెందిన 13 రకాల పత్తి విత్తన నమూనాలను సేకరించి ప్రయోగశాలకు పంపినట్లు వ్యవసాయ అధికారి తెలిపారు.రైతులు తాము కొనుగోలు చేసే విత్తనాలకు డీలర్ల నుండి ఖచ్చితంగా క్యాష్ బిల్లు (రసీదు) తీసుకోవాలి. డీలర్లు కూడా తప్పనిసరిగా రసీదు ఇవ్వాలని ఆదేశించారు. ఈ తనిఖీ కార్యక్రమాల్లో వ్యవసాయ విస్తరణ అధికారి వి. సౌజన్య తో పాటు ఇతర వ్యవసాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

# మహానాడు 2026ను విజయవంతం చేయాలి



**గిద్దలూరు పెన్ పవర్ మే 25**

మహానాడు-2026 విజయవంతానికి గిద్దలూరు నియోజకవర్గంలో విస్తృత సన్నాహక సమావేశం సోమవారం నిర్వహించారు. తెలుగుదేశం పార్టీ అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్న "మహానాడు-2026" కార్యక్రమాన్ని ఈ నెల 27 , 28 తేదీలలో గిద్దలూరు నియోజకవర్గంలోని తిరుమల కన్వెన్షన్ హాల్ లో విజయవంతంగా నిర్వహించాలనే లక్ష్యంతో నియోజకవర్గ ముఖ్య నాయకులతో విస్తృత స్థాయి సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గిద్దలూరు నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ నాయకులు, మండల అధ్యక్షులు, క్లస్టర్ ఇన్‌చార్జ్‌లు ముఖ్య కార్యకర్తలు కలిసి మహానాడు నిర్వహణకు సంబంధించిన ఏర్పాట్లపై సమగ్రంగా చర్చించారు. మహానాడును ఈసారి ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో హైబ్రిడ్ మోడల్ లో నిర్వహిస్తున్న నేపథ్యంలో, ప్రతి క్లస్టర్ పరిధిలో భారీ ఎల్ఈడి స్క్రీన్లు ఏర్పాటు చేసి ప్రత్యక్ష ప్రసార కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై దిశానిర్దేశం చేసుకున్నారు. సమావేశంలో ముఖ్యంగా చర్చించారు. ప్రతి మండలంలో మహానాడు వీక్షణకు అనువైన వేదికల ఎంపిక లైవ్ స్ట్రీమింగ్ నిర్వహణలో సాంకేతిక సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు పార్టీ శ్రేణులు, యువత, మహిళలు, అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొనేలా కార్యాచరణ రూపొందించడం ,క్లస్టర్ వారీగా బాధ్యతల కేటాయింపు , సమన్వయ వ్యవస్థ బలోపేతం మహానాడు సందేశాన్ని గ్రామ స్థాయికి తీసుకెళ్లే ప్రచార కార్యక్రమాల నిర్వహణ తదితర అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డి ఒక ప్రకటనలో మాట్లాడుతూ... తెలుగుదేశం పార్టీకి మహానాడు ఒక రాజకీయ కార్యక్రమం మాత్రమే కాకుండా పార్టీ ఆత్మగౌరవానికి ప్రతీక అని పేర్కొన్నారు. ప్రతి కార్యకర్త సమన్వయంతో పనిచేసి గిద్దలూరు నియోజకవర్గాన్ని రాష్ట్రంలోనే ఆదర్శంగా నిలిపే విధంగా మహానాడును విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో నియోజకవర్గంలోని ముఖ్య నాయకులు, పార్టీ ప్రజాప్రతినిధులు, మండల స్థాయి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# స్థల వివాదం ముదిరి మహిళపై దాడి

## -కందుకూరు ఏరియా ఆసుపత్రిలో చికిత్స



**కందుకూరు, పెన్ పవర్ మే 25**

మండలంలోని మాచవరం ఆది ఆంధ్ర కాలనీలో స్థల వివాదం ఉద్రిక్తతకు దారితీసి ఓ మహిళ గాయపడిన ఘటన స్థానికంగా కలకలం రేపింది. ఈ ఘటనపై కందుకూరు రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు.స్థానికుల కథనం ప్రకారం, మాచవరం ఆది ఆంధ్ర కాలనీకి చెందిన పాలిచర్ల అశ్వని కుమార్కు అదే ప్రాంతానికి చెందిన పాలిచర్ల చెంచయ్య, పాలిచర్ల దానియేలు, పాలిచర్ల నాతానియేలు, పాలిచర్ల ప్రవీణ్లతో కొంతకాలంగా స్థలం విషయంలో వివాదాలు కొనసాగుతున్నాయి. ఈ క్రమంలో అశ్వని కుమార్ తన మోటార్ బైక్‌పై వెళ్తుండగా, పై నలుగురు అడ్డగించి వాగ్వాదానికి దిగినట్లు సమాచారం. వాగ్వాదం క్రమంగా ఘర్షణకు దారితీయడంతో అశ్వని కుమార్‌పై దాడికి పాల్పడ్డారని తెలుస్తోంది. కుమారుడిని రక్షించేందుకు అడ్డుగా వచ్చిన అతని తల్లి పాలిచర్ల సువార్తమ్మపై కూడా దుండగులు మానవత్వం మరిచి దుర్భాషలాడుతూ దాడికి దిగినట్లు కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. ఈ సందర్భంగా ఓ వ్యక్తి రాయి తీసుకుని ఆమెపై దాడి చేయడంతో ఆమెకు గాయాలయ్యాయి.స్థానికులు వెంటనే స్పందించి గాయపడిన సువార్తమ్మను చికిత్స నిమిత్తం కందుకూరు ఏరియా ఆసుపత్రికి తరలించారు. అక్కడ వైద్యులు ఆమెకు చికిత్స అందించారు. ప్రస్తుతం ఆమె ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉన్నట్లు సమాచారం. ఈ ఘటనపై బాధిత కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కందుకూరు రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. స్థల వివాదాల నేపథ్యంలో చోటుచేసుకున్న ఈ ఘటన ప్రాంతంలో ఉద్రిక్తతకు కారణమైంది. పోలీసులు పూర్తి స్థాయిలో విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

# వినుకొండ నియోజకవర్గ టిడిపి పరిశీలకునిగా వక్కలగడ్డ



**మార్కాపురం పెన్ పవర్ మే25**

ఇటీవల తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి గా నియమితులైన వక్కలగడ్డ మల్లికార్జునరావు కు ఆ పార్టీ రాష్ట్ర అధిష్టానం మరో కీలక మైన బాధ్యతను అప్పుజెప్పింది.ఆయనను పల్నాడు జిల్లా వినుకొండ నియోజక వర్గానికి పార్టీ పరిశీలకునిగా నియమిస్తూ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు నుండి సోమవారం అధికారికంగా ఉత్తర్వులు వెలువడ్డాయి. ఆయన 2024 అసెంబ్లీ ఎన్నికల ముందు నంద్యాల జిల్లా శ్రీశైలం నియోజక వర్గానికి పార్టీ పరిశీలకునిగా, పార్టీ వాణిజ్య విభాగం ప్రధాన కార్యదర్శి గా కూడా పనిచేశారు. వక్కలగడ్డ సతీమణి వక్కలగడ్డ రాధిక గతంలో మార్కాపురం మున్సిపల్ చైర్మన్ గా బాధ్యతలను నిర్వర్తించారు. టిడిపి పార్టీతో రాజకీయ ప్రస్థానాన్ని ప్రారంభించిన వక్కలగడ్డ అనేక ఆటుపోట్లను తట్టుకుంటూ అదే పార్టీలో సుదీర్ఘ కాలం నుండి కొనసాగుతుండడం విశేషం. ఇప్పటివరకు పార్టీ అప్పుజెప్పిన భాధ్యతలను సమర్ధవంతంగా నిర్వర్తిస్తూ వచ్చారు. పార్టీకి చేసిన సేవలను గుర్తించి, పరిగణలోకి తీసుకున్న పార్టీ జాతీయ అధ్యక్షులు,ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పార్టీ రాష్ట్ర కమిటీలో ఇటివల సెక్రెటరీ గా అవకాశం ఇవ్వడం ఆనందంగా ఉందని వక్కలగడ్డ అభిమానులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. వినుకొండ నియోజక వర్గానికి పరిశీలకునిగా నియమితులైన సందర్భంగా వక్కలగడ్డ మాట్లాడుతూ తనపై ఎంతో నమ్మకంతో పార్టీ రాష్ట్ర సెక్రెటరీ గా, వినుకొండ నియోజక వర్గానికి పరిశీలకునిగా నియమించిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, వర్కింగ్ ప్రెసిడెంట్ నారా లోకేష్, రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు, ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి లకు కృతజ్ఞతలు తెలిపారు. కేంద్రంలో, రాష్ట్రంలో ఎన్ డి ఏ కూటమి ప్రభుత్వాలు అమలు పరుస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లి, మరోవైపు పార్టీ బలోపేతం కొరకు శాయశక్తుల కృషి చేస్తానని టిడిపి రాష్ట్ర సెక్రెటరీ, వినుకొండ నియోజక వర్గ పార్టీ పరిశీలకులు వక్కలగడ్డ మల్లికార్జునరావు తెలిపారు.

# నియోజకవర్గ టీడీపీ పరిశీలకురాలుగా శ్రావణి రెడ్డి

## -ఎమ్మెల్యేని మర్యాదపూర్వకంగా కలిసిన శ్రావణ రెడ్డి



**కందుకూరు పెన్ పవర్, మే 25**

నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ పరిశీలకురాలిగా మట్టం శ్రావణిరెడ్డిని పార్టీ అధిష్టానం నియమించింది. ఈమె ప్రస్తుతం పార్టీ రాష్ట్ర కార్యదర్శిగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఈ నేపథ్యంలో కందుకూరు శాసనసభ్యులు ఇంటూరి నాగేశ్వరరావు ని, శ్రావణి సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. శాలువాతో సత్కరించారు. ఎమ్మెల్యే కూడా ఆమెను సత్కరించారు.

# మద్యం మత్తులో వాహనం నడిపిన వ్యక్తికి జైలు శిక్ష

**కందుకూరు పెన్ పవర్, మే 25**

పట్టణ పరిధిలో మద్యం సేవించి వాహనం నడుపుతున్న పాలూరు గ్రామానికి చెందిన గుంతోటి శివ శంకర్ అను వ్యక్తిని కందుకూరు టౌన్ ఎస్ఐ పులి శివ నాగరాజు బ్రీత్ అనలైజర్ ద్వారా తనిఖీ చేసి అతనిని కందుకూరు అడిషనల్ జ్యుడిషియల్ సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ డి.రమేష్ బాబు ఎదుట హాజరపరచగా విచారించిన మెజిస్ట్రేట్ సదరు వ్యక్తికి 7 రోజులు జైలు శిక్ష విధించారని తెలిపారు. ఈ సందర్భంగా కందుకూరు టౌన్ ఎస్ఐ పులి శివ నాగరాజు మాట్లాడుతూ ఎవరైనా మద్యం మత్తులో వాహనాలు నడిపితే వారిపై చట్టపరంగా కఠినమైన చర్యలు తీసుకుంటామని, మద్యం మత్తులో వాహనాలు నడిపేవారికి కోర్టు పదివేల రూపాయలు జరిమానా లేదా జైలు శిక్ష విధిస్తున్నారని కావున ఎవరూ కూడా మద్యం మత్తులో వాహనాలు నడుపవద్దని కోరారు.

# కేఎల్ రాహుల్ అద్భుతమైన ఆటగాడు.. ఐపీఎల్ ట్రోఫీకి అతడు అర్హుడు: అంబటి రాయుడు!

## ఈ సీజన్‌లో రాహుల్ 593 పరుగులు
## నరైన్ బౌలింగ్‌ను సమర్థంగా ఎదుర్కొన్న రాహుల్
## రాహుల్‌కు ట్రోఫీ అందించాలన్న మాజీ క్రికెటర్
## ఢిల్లీ జట్టు ప్రదర్శనపై రాయుడు అసంతృప్తి



ఢిల్లీ క్యాపిటల్స్ వికెట్ కీపర్ బ్యాటర్ కేఎల్ రాహుల్‌పై భారత మాజీ క్రికెటర్ అంబటి రాయుడు ప్రశంసల వర్షం కురిపించాడు. ఐపీఎల్‌లో రాహుల్ ఏ జట్టుకు ఆడినా అద్భుతమైన ప్రదర్శన ఇచ్చాడని కొనియాడాడు. ఈ సీజన్‌లో అద్భుతంగా రాణించిన రాహుల్.. ఐపీఎల్ ట్రోఫీ గెలవడానికి పూర్తి అర్హుడని అభిప్రాయపడ్డాడు.

**ఢిల్లీ టీమ్‌లో అదరగొట్టాడు**

ఐపీఎల్ 2026 సీజన్‌లో కేఎల్ రాహుల్ బ్యాట్‌తో దుమ్మురేపాడు. ఈ సీజన్‌లో ఆడిన 14 మ్యాచ్‌ల్లో 174.41 స్ట్రైక్ రేట్‌తో ఏకంగా 593 పరుగులు చేశాడు. ఇందులో కోల్‌కతా నైట్ రైడర్స్‌తో ఈడెన్ గార్డెన్స్‌లో జరిగిన మ్యాచ్‌లో కేవలం 30 బంతుల్లోనే 60 పరుగులు చేసి జట్టుకు అండగా నిలిచాడు. అయితే రాహుల్ ఇంత బాగా రాణించినా, ఢిల్లీ క్యాపిటల్స్ జట్టు పాయింట్ల పట్టికలో ఆరో స్థానంతోనే సరిపెట్టుకుంది.

**సునీల్ నరైన్‌ను చితక్కొట్టాడు**

కోల్‌కతా స్పిన్నర్ సునీల్ నరైన్ బౌలింగ్‌ను ఈ సీజన్‌లో రాహుల్ ఎదుర్కొన్నంత ధైర్యంగా ఎవరూ ఎదుర్కోలేదని రాయుడు అన్నాడు. నరైన్ బౌలింగ్‌లో రాహుల్ కొట్టిన స్ట్రెయిట్ షాట్లు ఈ సీజన్‌లోనే అత్యుత్తమమైనవని చెప్పాడు. ఐపీఎల్‌లో హేజిల్‌వుడ్, నరైన్ లాంటి పెద్ద పెద్ద బౌలర్లను టార్గెట్ చేయడం రాహుల్‌కు అలవాటని, ఢిల్లీ మేనేజ్‌మెంట్ అతడికి ఒక విన్నింగ్ టీమ్‌ను అందించి ట్రోఫీ గెలిపించాలని కోరాడు.

**మిడిల్ ఓవర్లలో విధ్వంసం**

ముంబై ఇండియన్స్ మాజీ హెడ్ కోచ్ మార్క్ బౌచర్ కూడా రాహుల్ బ్యాటింగ్‌ను మెచ్చుకున్నాడు. కోల్‌కతా స్పిన్ ద్వయం నరైన్, వరుణ్ చక్రవర్తిలను మిడిల్ ఓవర్లలో రాహుల్ సమర్థంగా ఎదుర్కొని ఢిల్లీకి మంచి ఊపునిచ్చాడన్నాడు. పవర్‌ప్లే తర్వాత మిగతా జట్లను వణికించిన కోల్‌కతా స్పిన్నర్లపై రాహుల్ ఎదురుదాడికి దిగి వారి ప్రభావాన్ని తగ్గించాడని విశ్లేషించాడు.

**ఢిల్లీ జట్టుపై రాయుడు అసంతృప్తి**

ఢిల్లీ క్యాపిటల్స్ జట్టు ప్లేఆఫ్స్‌కు చేరకపోవడంపై రాయుడు అసంతృప్తి వ్యక్తం చేశాడు. మిచెల్ స్టార్క్, లుంగి ఎంగిడి, కుల్దీప్ యాదవ్, అక్షర్ పటేల్ లాంటి అనుభవజ్ఞులైన బౌలర్లు, డేవిడ్ మిల్లర్, కేఎల్ రాహుల్ లాంటి మ్యాచ్ విన్నర్లు ఉన్న ఢిల్లీ జట్టు టాప్-2లో ఉండాల్సిందని అభిప్రాయపడ్డాడు. టీమ్‌లో మంచి ఆటగాళ్లు ఉన్నా సరైన నిర్ణయాలు తీసుకోకపోవడం వల్లే వెనుకబడిపోతోందని ఇప్పటికైనా లోపాలను సరిదిద్దుకోవాలని సూచించాడు.

# పీటర్సన్ ఛాలెంజ్‌లో వైభవ్ విధ్వంసం.. 25 బంతుల్లోనే సెంచరీ.. టీ20ల్లో 200 పరుగులే లక్ష్యమన్న యువ సంచలనం!

## కెవిన్ పీటర్సన్ ఛాలెంజ్‌లో వైభవ్ సూర్యవంశీ అద్భుత ప్రదర్శన
## 50 బంతుల్లో 100 పరుగులు చేయాల్సి ఉండగా 25 బంతుల్లోనే పూర్తి
## శ్రేయస్ అయ్యర్ 22 బంతుల సెంచరీ రికార్డును త్రుటిలో చేజార్చుకున్న యువ సంచలనం
## టీ20ల్లో 200 పరుగులు చేసి క్రిస్ గేల్ రికార్డును బద్దలు కొట్టడమే తన లక్ష్యమని వెల్లడి

**హైదరాబాద్ పెన్ పవర్:** ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) 2026లో రాజస్థాన్ రాయల్స్ తరఫున ఆడుతున్న యువ సంచలనం, 15 ఏళ్ల వైభవ్ సూర్యవంశీ తన ప్రతిభతో మరోసారి అందరి దృష్టిని ఆకర్షించాడు. ఇంగ్లండ్ మాజీ కెప్టెన్ కెవిన్ పీటర్సన్ నిర్వహిస్తున్న యూట్యూబ్ ఛానెల్ షోలో పాల్గొన్న వైభవ్, విధ్వంసకర బ్యాటింగ్‌తో అదరగొట్టాడు. ఈ షోలో పీటర్సన్ విసిరిన సవాల్‌ను స్వీకరించి, కేవలం 25 బంతుల్లోనే సెంచరీ పూర్తి చేసి అందరినీ ఆశ్చర్యపరిచాడు. ఈ ఎపిసోడ్ చిత్రీకరణ సందర్భంగా పీటర్సన్ '50 బంతుల్లో 100 పరుగులు చేయాలి' అని వైభవ్‌కు ఒక ఛాలెంజ్ ఇచ్చాడు. అయితే, ఊహించని వేగంతో స్పందించిన ఈ యువ కెరటం, పార్కు నలువైపులా సిక్సర్లు బాదుతూ కేవలం 25 బంతుల్లోనే ఆ లక్ష్యాన్ని అందుకున్నాడు. రాజస్థాన్ రాయల్స్ జట్టు ఐపీఎల్ 2026 ప్లేఆఫ్స్‌కు అర్హత సాధించిన నాలుగో జట్టుగా నిలిచిన వెంటనే, పీటర్సన్ ఈ వీడియోను తన యూట్యూబ్ ఛానెల్‌లో ప్రసారం చేయడం విశేషం.




**శ్రేయస్ అయ్యర్ రికార్డ్ త్రుటిలో మిస్**

అద్భుతమైన ప్రతిభ కనబరిచినప్పటికీ, వైభవ్ సూర్యవంశీ ఈ షోలో వేగవంతమైన సెంచరీ రికార్డును త్రుటిలో చేజార్చుకున్నాడు. గతంలో ఇదే కార్యక్రమానికి హాజరైన పంజాబ్ కింగ్స్ కెప్టెన్ శ్రేయస్ అయ్యర్, ఇలాంటి ఛాలెంజ్‌లోనే కేవలం 22 బంతుల్లో సెంచరీ సాధించి రికార్డు సృష్టించాడు. వైభవ్ కేవలం 3 బంతుల తేడాతో ఈ రికార్డును అందుకోలేకపోయాడు. షో ప్రారంభంలో అయ్యర్ రికార్డును బద్దలు కొడతానని వైభవ్ ధీమా వ్యక్తం చేసినప్పటికీ, చివరికి రెండో స్థానంతో సరిపెట్టుకోవాల్సి వచ్చింది. పీటర్సన్ షోలో వేగవంతమైన సెంచరీల జాబితాలో శ్రేయస్ అయ్యర్ (22 బంతులు) అగ్రస్థానంలో ఉండగా, వైభవ్ సూర్యవంశీ (25 బంతులు) రెండో స్థానంలో నిలిచాడు. వీరి తర్వాత వెస్టిండీస్ ఆటగాడు నికోలస్ పూరన్ (28 బంతులు), ఏబీ డివిలియర్స్ (30 బంతులు) ఉన్నారు. వైభవ్ సహచర ఆటగాడు యశస్వి జైస్వాల్ ఇదే ఛాలెంజ్‌లో సెంచరీ చేయడానికి 47 బంతులు తీసుకున్నాడు.

**టీ20ల్లో 200 పరుగులే లక్ష్యం**

ఈ కార్యక్రమంలో వైభవ్ తన భవిష్యత్ లక్ష్యాలను కూడా పంచుకున్నాడు. టీ20 ఫార్మాట్‌లో డబుల్ సెంచరీ సాధించాలన్నది తన ఆశయమని స్పష్టం చేశాడు. ప్రస్తుతం టీ20ల్లో అత్యధిక వ్యక్తిగత స్కోరు రికార్డు క్రిస్ గేల్ పేరిట ఉంది. ఐపీఎల్ 2013 సీజన్‌లో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు తరఫున గేల్ 175 పరుగులు సాధించాడు."నేను టీ20ల్లో 200 పరుగులు చేయాలనుకుంటున్నాను" అని వైభవ్ పీటర్సన్‌తో అన్నాడు. దీనికి పీటర్సన్ "క్రిస్ గేల్ 175 పరుగులు చేశాడు కదా" అని గుర్తుచేయగా, "అవును, నేను అతని రికార్డును బద్దలుకొట్టి 200 స్కోర్ చేయాలనుకుంటున్నాను. ఏ గేమ్‌లోనైనా పూర్తి 20 ఓవర్లు బ్యాటింగ్ చేసే అవకాశం వస్తే, నేను ఆ రికార్డును కచ్చితంగా బ్రేక్ చేస్తాను" అని వైభవ్ ధీమా వ్యక్తం చేశాడు. అతని ఆత్మవిశ్వాసం, ప్రతిభ చూసి క్రీడా విశ్లేషకులు ప్రశంసలు కురిపిస్తున్నారు.



ప్రగ్యా నాగ్రా అద్భుతమైన రాయల్ బ్లూ గ్లామ్ ఫోటోషూట్‌లో తళుకుమంది

# ఇప్పుడు టెంపర్ వస్తే రూ.1000 కోట్లు సాధిస్తుందా? సాధ్యమేనా?



యంగ్ టైగర్ జూనియర్ ఎన్టీఆర్ కెరీర్ ను మలుపు తిప్పిన సినిమాల్లో టెంపర్ కచ్చితంగా ముందు వరుసలో ఉంటుంది. 2015లో విడుదలైన ఆ సినిమా తారక్ లోని నటుడిని మరోస్థాయికి తీసుకెళ్లిందనే అభిప్రాయం అభిమానుల్లో ఇప్పటికీ ఉంది. తాజాగా నిర్మాత నిర్మాత బండ్ల గణేష్ చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు సోషల్ మీడియాలో హాట్ టాపిక్ గా మారాయి. ఇప్పుడు టెంపర్ తీస్తే రూ.1000 కోట్లు వచ్చేవంటూ ఆయన చేసిన కామెంట్స్ పై నెట్టింట చర్చ మొదలైంది.నటుడు రాజా రవీంద్రతో బండ్ల గణేష్ పలు ఆసక్తికర విషయాలు వెల్లడించారు. బాద్ షా తర్వాత తారక్ కు వరుసగా ఫ్లాపులు వచ్చాయని, రామయ్య వస్తావయ్యా, రభస ఆశించిన స్థాయిలో ఆడలేదని గుర్తు చేశారు. అలాంటి సమయంలో వక్కంతం వంశీ చెప్పిన కథ తనకు బాగా నచ్చిందని, ఆ స్టోరీ దర్శకుడు పూరీ జగన్నాథ్ దగ్గరకు తీసుకెళ్లినట్లు చెప్పారు. కథ విన్న వెంటనే 'ఇది నీకు మరో 'గబ్బర్ సింగ్' అవుతుంది' అని పూరీ చెప్పారని బండ్ల గణేశ్ వెల్లడించారు.అయితే అసలు ప్రశ్న మాత్రం ఒక్కటే.. నిజంగానే ఇప్పుడు టెంపర్ విడుదలైతే రూ.1000 కోట్లు సాధించేదా? సినీ ఎక్స్పర్ట్స్ అభిప్రాయం ప్రకారం దీనికి కచ్చితమైన సమాధానం చెప్పడం కష్టం. ఎందుకంటే 2015లోని మార్కెట్ పరిస్థితులకు ఇప్పటి పరిస్థితులు పూర్తిగా భిన్నంగా ఉన్నాయి. అప్పట్లో పాన్ ఇండియా మార్కెట్ ఈ స్థాయిలో లేదు. ఓటీటీ ప్రభావం కూడా తక్కువే. టికెట్ ధరలు, థియేటర్ కలెక్షన్లు, ఓవర్సీస్ మార్కెట్, డిజిటల్ రైట్స్.. అన్నీ ఇప్పుడు భారీగా పెరిగాయి.అదే సమయంలో ప్రస్తుతం తారక్ మార్కెట్ విపరీతంగా పెరిగింది. ఆర్ఆర్ఆర్ తర్వాత ఆయనకు పాన్ ఇండియా రేంజ్ గుర్తింపు వచ్చింది. హిందీ మార్కెట్ లో కూడా మంచి ఫాలోయింగ్ ఏర్పడింది. అందుకే అభిమానులు ఇప్పటి తారక్ తో అదే స్థాయి కంటెంట్ వస్తే భారీ వసూళ్లు సాధించే అవకాశం ఉండేదేమోనని అభిప్రాయపడుతున్నారు. అయితే రూ.1000 కోట్లు అంటే మాత్రం చాలా పెద్ద టార్గెట్ అని మరికొందరు అంటున్నారు.టెంపర్ కథ కూడా ప్రేక్షకులకు మంచిగా కనెక్ట్ అయింది. అవినీతిపరుడైన పోలీస్ అధికారి దయా జీవితంలో జరిగిన సంఘటనలు అతడిని ఎలా మార్చాయనే అంశాన్ని దర్శకుడు చూపించారు. ముఖ్యంగా క్లైమాక్స్ కోర్టు సీన్ లో తారక్ యాక్టింగ్ కు ప్రేక్షకులు ఫిదా అయ్యారు. ఆ సన్నివేశం ఇప్పటికీ తెలుగు సినీ అభిమానులు గుర్తు చేసుకునే క్లాసిక్ మోమెంట్ గా నిలిచింది.సినిమాలో కాజల్ అగర్వాల్ హీరోయిన్ గా నటించగా, ప్రకాష్ రాజ్ విలన్ పాత్రలో ఆకట్టుకున్నారు. పూరీ జగన్నాథ్ మార్క్ డైలాగ్స్, యాక్షన్ ఎలివేషన్స్, తారక్ ఎనర్జీ కలిసి సినిమాను బ్లాక్ బస్టర్ గా నిలిపాయి. అప్పట్లో ఆ చిత్రం తారక్ కెరీర్ కు పెద్ద బూస్ట్ ఇచ్చింది. ఆ తర్వాత ఆయన వరుస విజయాలతో స్టార్ హీరోగా మరింత ఎదిగిపోయారు. ఏదేమైనా బండ్ల గణేష్ చేసిన రూ.1000 కోట్ల కామెంట్ కాస్త అతిశయోక్తిగా అనిపించినా.. టెంపర్ తారక్ కెరీర్ లో స్పెషల్ మూవీ అని చెప్పడంలో డౌట్ అక్కర్లేదు.



మృణాల్ ఠాకూర్ బోల్డ్ స్లిప్డ్ లుక్‌లో స్టన్స్, అభిమానులు ఆమెను ఫ్యాషన్ క్వీన్ అని పిలుస్తారు

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, ONGOLE MANDAL, prakasam district, Andhrapradesh-523001. and published at D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, ONGOLE MANDAL, prakasam district, Andhrapradesh-523001. Editor: GANTYADA APPARAO. Mobile : 9059465965, RNI : APTEL/25/A2230, editorpenpower@gmail.com